# మనం
## ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం



www.manamepaper.com మంగళవారం | 14 | ఏప్రిల్ | 2026 | పేజీలు : 23

## నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలు

### జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకలలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9-00 గంటలకు ఖమ్మం అంబేద్కర్ సెంటర్ లో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలల అలంకరణ, ఉదయం 10-30 గంటలకు శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించు జయంతి సభ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఎస్సీ, బీసీ, ఎస్టీ సంఘ నాయకులు, అన్ని వర్గాల ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

## పేద మహిళల ఆర్థిక సాధికారతకు చర్యలు





- మహిళల ఆదాయం పెరిగితేనే కుటుంబ సంక్షేమం సాధ్యం
- ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యంతో పేదలకు భరోసా
- నిబద్ధతతో అంగన్వాడీ సేవలు నిర్వహించాలి..
- సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు
- క్యాంపు కార్యాలయంలో 500 కుట్టుమిషన్లు, టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో అంగన్వాడీ టీచర్లకు సెల్ఫోన్ల పంపిణీ

2లో..

## భద్రాచలంలో గర్జించిన ఐక్యతా గళం..

5 గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేసేలా పోరాటం చేస్తా

రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి

వివరాలు 12లో..

## రోడ్డు భద్రత, సురక్షితమైన ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

వివరాలు 17లో..

# జీరో మాతృ, శిశు మరణాలే లక్ష్యం

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ప్రతి ప్రసవం సురక్షితం అనే సందేశం ప్రజలకు చేరాలి
- హై రిస్క్ గర్భిణీల గుర్తింపు, ప్రత్యేక పర్యవేక్షణ కీలకం
- పాఠశాలల్లో పోక్సో అవగాహన, పిల్లల భద్రతపై ప్రత్యేక చర్యలు
- మాతృ శిశు మరణాలు తగ్గింపు, సంక్షేమ శాఖపై కలెక్టర్ సమీక్ష



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాలు లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో మాతృ, శిశు మరణాలు తగ్గింపు, సంక్షేమ శాఖపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ప్రతి ప్రసవం సురక్షితంగా జరుగుతుందనే సందేశం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో జీరో మాతృ, శిశు మరణాల లక్ష్య సాధనకు అన్ని విభాగాలు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు. ప్రతి పీహెచ్సీ పరిధిలో హై రిస్క్ గర్భిణీలను తప్పనిసరిగా గుర్తించాలన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనాల ప్రకారం 12 నుండి 15 శాతం గర్భిణీలు హై రిస్క్ కేటగిరీలో ఉంటారని తెలిపారు. ఏ పీహెచ్సీ హై రిస్క్ కేసులు లేవని నివేదిస్తే గుర్తింపు ప్రక్రియలో లోపాలు ఉన్నట్లేనని, అలాంటి ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న హై రిస్క్ గర్భిణీలను ఒక్క వారం లోపు పూర్తి స్థాయిలో గుర్తించి, వారి కోసం బర్త్ ప్లానింగ్ సిద్ధం చేయాలని సూచించారు. ఆరోగ్య శాఖలో అందుబాటు లో ఉన్న మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించి ప్రతి పీహెచ్సీకి అవసరమైన సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ వారం నిర్వహించి, సున్నిత వర్గాల పిల్లల పూర్తి స్థాయి డేటా 2లో..

# అంతర్జాతీయ స్థాయి కథలు, కవితలకు ఆహ్వానం

## – 8వ వార్షికోత్సవ సభలో విజేతలకు నగదు బహుమతులు
## – వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** వురిమళ్ల ఫౌండేషన్ 8వ వార్షికోత్సవం సందర్భంగా 2026 సంవత్సరానికి గాను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించనున్న కథలు, కవితల పోటీలకు రచనలు ఆహ్వానిస్తున్నట్లు వురిమళ్ల ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వురిమళ్ల సునంద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వురిమళ్ల శ్రీరాములు స్మారక కథల పోటీల్లో ప్రథమ బహుమతి 5 వేలు, ద్వితీయ బహుమతి 4 వేలు, తృతీయ బహుమతి 3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రెండు కన్సోలేషన్ బహుమతులు ఇవ్వనున్నామని, ఒక్కో బహుమతికి వెయ్యి రూపాయల చొప్పున ఇస్తామని తెలిపారు. కథ చేతిరాతలో 5 పేజీలు, డిటిపి చేసి పంపిస్తే 3 పేజీలకు మించరాదని సూచించారు. ఏదైనా సామాజికాంశం మీద కథ ఉండాలని, హామీ పత్రం విడిగా రాసి జత చేయాలని సూచించారు.

వురిమళ్ల పద్మజ స్మారక కవితల పోటీల్లో ప్రథమ బహుమతి 4 వేలు, ద్వితీయ బహుమతి 3 వేలు, తృతీయ బహుమతి 2వేలతో పాటు కన్సోలేషన్ బహుమతులను రెండింటికి వెయ్యి రూపాయల చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. కవిత 25 లైన్లకు మించరాదని, ఏదైనా సామాజికాంశం మీద కవిత రాయాలని, హామీ పత్రం విడిగా జత చేసి పంపించాలని సూచించారు.

వీటితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాహిత్యంలో విశేష కృషి చేస్తున్న వారిని ఎంపిక చేసి 'భోగోజు సముద్రమ్మ-పురుషోత్తం' స్మారక పురస్కారంతో పాటు పది వేల నగదు బహుమతిని అంద చేయనున్నట్లు తెలిపారు. అక్షరాలతోవ సాహిత్య సంస్థ సహకారంతో జరిగే వురిమళ్ల ఫౌండేషన్ 8వ వార్షికోత్సవ సభలో విజేతలకు బహమతులు, పురస్కారాలు అందచేయనున్నట్లు తెలిపారు. కథలు, కవితలను మే 15, 2026 తేదీ నాటికి భోగోజు ఉపేందర్‌రావు, ఇంటి నెం.11-10-694/5, బురహాన్‌పురం, ఖమ్మం అనే చిరునామాకు పంపించాలని కోరారు. పూర్తి వివరాలకు 9441815722 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

# 300 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

## – జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్



**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 13 (మనంన్యూస్):**లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారు చెలక గ్రామంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామంలోని రైస్ మిల్లు శ్రీ శ్రీనివాస మోడరన్ రైస్ మిల్ (నాన్-సీఎంఆర్ విభాగం) తనిఖీలు నిర్వహించి సుమారు 607 ప్లాస్టిక్ బస్తాలలో 300 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినపీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసిచేసారు.పౌరసరఫరాల శాఖ నిబంధనల ప్రకారం పిడిఎస్ బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై కేసులు నమోదు చేసారు. ఈ తనిఖీలలో డిప్యూటీ తహాశీల్దార్ కొత్తగూడెం మహేశ్, డిప్యూటీ తహాశీల్దార్ భద్రాచలం గుండు రాజులు, యూడీఆర్ఐ యెల్లందు సోయం రాంబాబు పాల్గొన్నారు.

# 48వ డివిజన్లో ఇందిరమ్మ చీరల పంపిణీ

**ఖమ్మం ఏప్రిల్ 13(మనం న్యూస్):** స్థానిక 48వ డివిజన్లో దానవాయిగూడెం పార్కు దగ్గర సోమవారం కాంగ్రెస్ డివిజన్ నాయకుడు అల్లే సాయి కిరణ్, బోజట్ల సత్యనారాయణ, సింగం అంజయ్య కంకిపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా అల్లె సాయికిరణ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నిటినీ అమలు చేసి ప్రజలకు చేరవేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోయ బాలాజీ, వార శివ, ఎస్కే జహీర్, మేచిని రామకృష్ణ, యాక లక్ష్మి, తరుణ్, సారంగపాణి, రాహుల్ రెడ్డి, కిషోర్, మూర్తి, కాంగ్రెస్ నాయకులు ఆశ వర్కర్లు, ఆర్పీల, అంగన్వాడి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు






## భావసంగ్ మహారాజ్, మ్యారామా భవాని

# పేర్లని కొనసాగించాలి

## – 15న ఆత్మగౌరవ సదస్సుకు తరలి రావాలి
## – లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య స్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** భావసంగ్ మహారాజ్, మ్యారామా భవాని పేర్లని విస్మరిస్తూ మరిపెడ మండల మాకుల తండా మాకుల దేవాలయ దేవాదాయ శాఖ అధికారులు చేసిన దుశ్చర్యలను ఖండిస్తూ ఈ నెల 15న జరిగే ఆత్మగౌరవ సదస్సు వాల్‌పోస్టర్‌ను లంబాడీల ఐక్య వేదిక(లైవ్) రాష్ట్ర ముఖ్య స్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్ ఆవిష్కరించారు. సోమవారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాకుల దేవాలయ నిర్మాణం. భూమి దాతల మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే సురేందర్ రెడ్డి చెప్పిన విధంగా గత సంవత్సరం ఏప్రిల్ 9న మ్యారమా భవానీ విగ్రహ ప్రతిష్ట ఆయన చేతుల మీదుగా చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు గుడి మీద ఎలాంటి శిలాఫలకం కూడా లేకపోవడం శోచనీయమన్నారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ మారెమ్మ తల్లి పేరు మీద ప్రచురితమయ్యాయని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి ఆదివారం, జాతర సందర్భముగా వేలాది మంది లంబాడీ భక్తులు భావసంగ్ బావను దర్శించుకొని మొక్కులు చెల్లించి భోగ్ భండార్ కార్యక్రమం చేస్తారని తెలిపారు. పక్కనే ఉన్న మ్యారామ భవానికి యేట పోతులను కోసి మొక్కులు చెల్లిస్తారని చెప్పారు. ఇక్కడ కేవలం భావసంగ్ బావా, మ్యారమా భవాని కోసం మాత్రమే లంబాడీలు వస్తారని, వారి మనోభావాలు దెబ్బ తీయకుండా అలాగే ఇతర కులాల భక్తుల మనోభావాలు కించపరచకుండా భావసంగ్ బావా, మ్యారమా భవానీ పేరును కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో లైవ్ అడ్వకేట్ విభాగ రాష్ట్ర కార్య దర్శి భూక్యా హరి నాయక్, బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర నాయకులు బానోతు లింగా నాయక్, లైవ్ భద్రాద్రి జోనల్ కోఆర్డినేటర్ జాదవ్ మంగీలాల్, జిల్లా అడ్వకేట్ విభాగ సెక్రటరీ మణిమాల, బ్లూ ఇండియా పార్టీ జిల్లా నాయకులు హరి నాయక్, లైవ్ డోర్నకల్ నియోజక వర్గ అధ్యక్షులు ప్రవీణ్ నాయక్ , పాలేరు నియోజక వర్గ అధ్యక్షులు శోభన్ నాయక్, సేవాలాల్ సేన నియోజక వర్గ ఇంచార్జీ నరేష్ నాయక్, లైవ్ బావోజీల సంఘ రాష్ట్ర నాయకులు బానోతు సీతారామ్ నాయక్, లైవ్ మరిపెడ మండల అధ్యక్షులు దేవేందర్ నాయక్ పాల్గొన్నారు.

# జీరో మాతృ, శిశు మరణాలే...

(మొదటి పేజీ తరువాయి)

సేకరణ చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, అనాథలు, బాల కార్మికులు, సదరం కేటగిరీ పిల్లల వివరాలు సమగ్రంగా సేకరించి, అన్ని శాఖలతో సమన్వయం చేసి వారికి ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందేలా చూడాలని తెలిపారు.పాఠశాలల్లో పోక్సో చట్టం అమలు బాధ్యతను ఉపాధ్యాయులకు అప్పగించి, బాలలపై దుర్వినియోగాన్ని గుర్తించేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించా లని సూచించారు.పాఠశాలల్లో పిల్లల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించే ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఐసిడిఎస్, విద్యా శాఖలు ఈ అంశంపై పర్యవేక్షణ చేయాలని తెలిపారు.అంగన్వాడీ కేంద్రాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చికిత్స అందించాలనీ, అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించాలన్నారు. ఆర్బీఎస్కే బృందాలు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.మాతృ, శిశు మరణాల ప్రతి ఘటనను విశ్లేషించి కారణాలను గుర్తించి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశా, అంగన్వాడీ సిబ్బంది చురుకుగా పని చేసి గర్భిణీల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, డి.డబ్ల్యు.ఓ. వేల్పుల విజేత, డిసిపిఓ విష్ణు వందన, విద్యా శాఖ,సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద మహిళల ఆర్థిక సాధికారతకు చర్యలు

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** పేద మహిళల ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.సోమవారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో 500 మంది మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేయడంతో పాటు, టీఎన్జీవో ఫంక్షన్ హాల్లో అంగన్వాడీ టీచర్లకు సెల్ఫోన్లను మంత్రి అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మహిళల సాధికారత కుటుంబ సంక్షేమానికి అత్యంత అవసరమని అన్నారు. పేదరికం నుండి బయటకు తీసుకురావాలంటే మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆదాయం సంపాదించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల నుంచి 23 వేల కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని తెలిపారు.మహిళల కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై ప్రభుత్వం 10 వేల కోట్ల వ్యయం చేస్తోందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఖమ్మం నగరంలో ఇప్పటికే 2500 ఇళ్లు మంజూరు చేయగా, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 22 వేల కోట్ల వ్యయంతో కార్యక్రమం అమలు జరుగుతోందని, వచ్చే ఏడాది మరో 3500 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందనున్నారని తెలిపారు.పేద ప్రజలు కూడా నాణ్యమైన ఆహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 14 వేల కోట్లతో సన్నబియ్యం పంపిణీ చేస్తోందని, గతంలో ఈ ప్రయోజనం మధ్యవర్తులకు మాత్రమే చేరేదని, ప్రస్తుతం నేరుగా ప్రజలకు అందిస్తున్నామని మంత్రి అన్నారు.రైతులు, యువత, కూలీలు ప్రతి వర్గం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ద్వారా లబ్ధి పొందుతున్నారని మంత్రి తెలిపారు. ముఖ్యంగా మైనారిటీ పిల్లలు తప్పనిసరిగా విద్యను అభ్యసించాలన్నారు.గురుకుల పాఠశాలల్లో 3 వేల మంది విద్యార్థులు చదువుకునే అవకాశం కల్పించగా, ఒక్క రూపాయి ఖర్చు చేయకుండా ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం సంవత్సరానికి సుమారు 1.5 లక్షలు వెచ్చిస్తోందని చెప్పారు. మన పిల్లలు విద్యను అభ్యసిస్తేనే పేదరికం నుండి బయటపడగలమని, నాణ్యమైన విద్య పొందిన పిల్లలు భవిష్యత్తులో ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు సాధించి కుటుంబానికి గౌరవం, ఆనందం తీసుకొస్తారని మంత్రి తెలిపారు.అంగన్వాడీ టీచర్లకు సెల్ ఫోన్ పంపిణి వద్ద ప్రత్యేకంగా మాట్లాడిన మంత్రి తాను గతంలో అంగన్వాడీ శాఖ మంత్రిగా పని చేసిన సమయంలో రెండు సార్లు వేతనాలను పెంచినట్లు గుర్తుచేశారు. అంగన్వాడీ టీచర్లు పేద ప్రజలకు సేవ చేసే గొప్ప అవకాశం పొందారని, దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న చిన్న అసౌకర్యాల పేరుతో ర్యాలీలు చేయకుండా నిబద్ధతతో పనిచేయాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు.అంగన్వాడీ టీచర్లకు అందజేసిన సెల్ఫోన్లు ప్రజలకు సేవలందించేందుకు సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రి సూచించారు. సెల్ఫోన్ల ద్వారా అంగన్వాడీ సేవలపై పూర్తి స్థాయి పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు కొత్త భవనాలు మంజూరు చేసినట్లు, వాటిని అన్ని సౌకర్యాలతో త్వరగా పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.అనంతరం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్ వద్ద ఖమ్మం నగరపాలక సంస్థ చే కొనుగోలు చేసిన 3 రహదారి ఊడ్చే యంత్రాలను మంత్రి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, జిల్లా సంక్షేమ అధికారిణి వేల్పుల విజేత, ఖమ్మం నగర పాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు

**– కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**– 16న మండల స్థాయిలో ప్రజా పాలన కార్యక్రమాలు**
**– పీఎం రాహత్ పథకం ద్వారా ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు క్యాష్లెస్ చికిత్స**
**– రాహ–వీర్ పథకం కింద గోల్డెన్ అవర్లో సహాయం చేసిన వారికి 25 వేలు బహుమతి**
**– ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సమీక్షించిన కలెక్టర్**

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** రోడ్డు ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాస రెడ్డి లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఏప్రిల్ 16న మండల స్థాయిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ సభల తరహాలో నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచాలని, శానిటేషన్ను నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని తెలిపారు. ఉపయోగంలో లేని పాత ఫర్నిచర్, స్క్రాప్ వాహనాలను తొలగించాలని, ఫీల్ సందర్శనల్లో ఇవి కనిపిస్తే



చర్యలు తప్పవని హెచ్చరించారు.అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని చేపట్టాలని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 30 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, అక్కడే 50 శాతం కంటే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ బ్లాక్ స్పాట్లను యుద్ధ ప్రాతిపదికన సరి చేయాలని, అలాగే కొత్తగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.'రాహ–వీర్', 'పీఎం రాహత్' పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. రాహ వీర్ పథకం ప్రకారం ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని గోల్డెన్ అవర్లో ఆసుపత్రికి చేర్చిన వారికి 25 వేల రూపాయలు బహుమతి లభిస్తుందని, పీఎం రాహత్ పథకం ప్రకారం ప్రమాద బాధితులకు ఆసుపత్రుల్లో లక్షన్నర వరకు క్యాష్లెస్ చికిత్స అందుబాటులో ఉంటుందని వివరించారు. ఈ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంచి గోల్డెన్ అవర్ను సమర్థవంతంగా వినియోగించి ప్రాణాలను కాపాడాలని సూచించారు.ప్రైవేట్ పాఠశాల బస్సులు, వాహనాల ఫిట్నెస్, డ్రైవర్ల ఆరోగ్య పరిస్థితిని తప్పని సరిగా పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆర్టిఓ ను ఆదేశించారు. రోడ్డు భద్రతపై గ్రామ సభలను నిర్వహించాలని, ముఖ్యంగా లారీ డ్రైవర్లు వంటి కమర్షియల్ డ్రైవర్లకు కంటి పరీక్ష శిబిరాలను యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, ఇంచార్జీ ఆర్టిఓ జె.ఎన్ శ్రీనివాస రావు, ఏఎంవిఐ లు జి. దినేష్, జి. సుమలత, ఆర్టీఏ మెంబర్ జి.వెంకన్న, అధికారులు, పాల్గొన్నారు.

# వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

**కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని వడదెబ్బ తగలకుండా ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. ఎండదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, ఎండలో బయట తిరగవద్దని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతిరోజు సరిపడ త్రాగునీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్ళేటప్పుడు గొడుగు, టోపిని, సన్నని లేత రంగు కాటన్ వస్త్రాలను దరించాలని, ద్విచక్ర వాహానాలపై సుదూర ప్రయాణాలు చేయకూడదని, సూర్యుని కిరణాలు శరీరంపై నేరుగా పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే ఎండలో పనిచేసే కార్మికులు తరచుగా నీటీతో పాటు ఓ.ఆర్.ఎస్. ద్రావణాన్ని తీసుకోవాలని తద్వారా వడదెబ్బ నుండి శరీరాన్ని కాపాడుకోవచ్చన్నారు. అధిక మాంసకృత్తులు కలిగిన ఆహారాన్ని , నిల్వ ఆహారాన్ని తినవద్దని, నిలిపి ఉంచిన వాహనంలో పిల్లలను లేదా పెంపుడు జంతువులను వదిలివేయవద్దని, వాహనం లోపల ఉష్ణోగ్రత పెరిగి ప్రమాదకరంగా మారవచ్చని అన్నారు.అధిక చమట, దాహం, బలహీనత, తల తిప్పడం, కండరాలు పట్టేయడం వంటి లక్షణాలు వున్నచో వడదెబ్బగా భావించి సమీప ఆరోగ్య కేంద్రం తీసుకెళ్లాలని కోరారు. అదే విధంగా వీరికి సహాయం అందే వరకు చల్లని ప్రదేశానికి తరలించాలని, చల్లని నీటితో శరీరాన్ని తుడవాలనీ, వీలైనంత గాలి తగిలే విధంగా జాగ్రత్త వహించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# విద్యుత్ కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు : నెల్లూరి



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికుల పోరాటానికి భారతీయ జనతా పార్టీ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. సోమవారం ఖమ్మం నగరంలో కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సందర్శించి, కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి వెలుగులు పంచడం కోసం విద్యుత్ కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. అర్ధరాత్రి వేళల్లో, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాల్లో సైతం విద్యుత్ స్తంభాలు ఎక్కి మరమ్మతులు చేసే క్రమంలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, మరికొందరు శాశ్వత అంగవైకల్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాణాపాయం ఉందని తెలిసినా వెనకాడకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి క్షేత్రస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఇప్పటికీ బ్రిటిష్ కాలం నాటి పాత నిబంధనలనే అమలు చేస్తూ కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకర మన్నారు. తక్షణమే ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు స్పందించి కార్మికుల న్యాయమైన కోరికలను తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కష్టపడే వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టినప్పుడే ప్రభుత్వాలకు గౌరవం ఉంటుందని హితవు పలికారు. కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు బిజెపి వారికి అండగా ఉండి, ఈ పోరాటంలో భాగస్వామ్యం వహిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సుబ్బారావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తా వెంకటేశ్వర్లు, ఖమ్మం అర్బన్ అధ్యక్షులు వాకదాని రామకృష్ణ, వెంకన్న పాల్గొన్నారు.

మనం



# ఖమ్మం

**ఖమ్మం కార్పొరేషన్- ఖమ్మం అర్బన్ - రఘునాధపాలెం**

# నేడు టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ పర్యటన

**– జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్**



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** 14న మంగళవారం ఖమ్మం జిల్లాలో జరిగే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఉదయం 10.00 గంటలకు ర్యాలీగా కోదాడ క్రాస్ రోడ్ నుండి, ఎన్టిఆర్ సర్కిల్, శ్రీ శ్రీ సర్కిల్, జెడ్పీ సర్కిల్కు ర్యాలీగా వచ్చి అక్కడ డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తారని తెలిపారు. అనంతరం సంజీవరెడ్డి భవన్లో జరిగే జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన పదవీ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, శాసనసభ సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, మట్టా రాగమయి, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు హాజరు కానున్నారని, పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం: మాజీ ఎంపీ నామ



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో అంబేద్కర్ స్ఫూర్తి కీలకమని పేర్కొంటూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం, అలాగే హైదరాబాద్లో 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆచరణలో చూపించిందని చెప్పారు. రైతులకు రైతుబంధు, దళిత, బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు వివరించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి దళిత వర్గాల ఆర్థిక పురోగతికి దోహదపడిందని తెలియజేశారు. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ హాయంలోనే అత్యధిక సంఖ్యలో గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, దళిత బహుజన పిల్లలకు ఉచిత విద్యను అందించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని కేసీఆర్ ఆదేశాల మేరకు 17వ లోక్సభలో తన వంతు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు వెల్లడించారు.

# అర్బన్, రూరల్ తహశీల్దార్లకు శుభాకాంక్షలు తెలిపిన మాల మహానాడు నాయకులు



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలం తహశీల్దార్లను ఖమ్మం జిల్లా మాల మహానాడు నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు దళిత ఉద్యమ నాయకులు గుంతేటి వీరభద్రయ్య అధ్యక్షతన నాయకులు మర్యాదపూర్వ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాల్వాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు ఖమ్మం జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీను, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షులు మెట్టు వెంకటేశ్వర్లు, కత్రం పుష్ప రాజ్, కరాటే వేణు, చింతమల్ల వెంకటేశ్వర్లు, కొరివి భాస్కర్, ఖమ్మం జిల్లా మాల మహానాడు మీడియా కన్వీనర్ పాగ యోనా పాల్గొన్నారు.

మనం



# పాలేరు

కూసుమంచి - నేలకొండపల్లి- ఖమ్మం రూరల్ - తిరుమలాయపాలెం

## ఘనంగా టీఎస్‌యుటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**కూసుమంచి, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** కూసుమంచి మండల కమిటీ ఆధ్వర్యంలో టీ ఎస్ యు టీ ఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్ శ్రీనివాస చారి పతాకావిష్కరణ చేసి ప్రారంభించారు, ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మండవ. నర్సయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ విద్య రంగా పరిరక్షణలో ఉపాధ్యాయ అధ్యాపక సమస్యల పరిష్కారానికి టీఎస్ యుటిఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు, పెండింగ్లో ఉన్న డిఏలు ఇతర బిల్లు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు చిలకల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, నాగలక్ష్మి, కార్యదర్శులు బాబురావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు ఇంకా అనేకమంది ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కు షాక్... పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల టాప్

### పిండిప్రోలు జూనియర్ కళాశాల ఫలితాలతో కొత్త సందేశం..




**తిరుమలాయపాలెం ఏప్రిల్ 13 (మనం న్యూస్)** విద్య అంటే ఖర్చే అన్న భావనను పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తుడిచిపెట్టేశారు. లక్షల రూపాయలు ఖర్చు చేసి కార్పొరేట్ కళాశాలల్లో చదివించినా, ప్రభుత్వ కళాశాలలో సాధించిన ఫలితాలకంటే ప్రత్యేకత లేదని తాజా ఇంటర్మీడియట్ ఫలితాలు స్పష్టం చేశాయి. పరిమిత వనరులు, సాధారణ వాతావరణం ఉన్నప్పటికీ, పిండిప్రోలు ప్రభుత్వ కళాశాల విద్యార్థులు సాధించిన మార్కులు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. క్రమశిక్షణ, పట్టుదల, ఉపాధ్యాయుల నిబద్ధత,ఈ మూడు కలిసి విజయానికి బలమైన పునాది వేశాయి. ఈ ఫలితాలు ఒక్క కళాశాల విజయమే కాకుండా, ప్రభుత్వ విద్యపై ఉన్న అపోహలకు గట్టి సమాధానంగా నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత ఉంటే అద్భుతాలు చేయగలరని ఈ విజయాలు నిరూపిస్తున్నాయి. ఇక తల్లిదండ్రులు కూడా తమ పిల్లల భవిష్యత్తు కోసం భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉందా అనే ఆలోచనలో పడేలా ఈ ఫలితాలు మార్గదర్శకంగా మారాయి. తక్కువ ఖర్చుతో, మెరుగైన విద్యను అందించే ప్రభుత్వ కళాశాలలు ఇప్పుడు మరోసారి ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నాయి. కళాశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, “విద్యార్థుల కష్టమే మా గర్వం. ప్రభుత్వ కళాశాలల్లో కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని మేము నిరూపించాం” అని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ రామకృష్ణ తెలిపారు.

## ఖమ్మం రూరల్‌లో సీపీఐ(ఎంఎల్) నిరసన ర్యాలీ



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13 (మనం న్యూస్)** ఎన్ఐఏ నోటీసులకు నిరసనగా ఖమ్మం రూరల్ మండలం ఎంకటాయపాలెం గ్రామంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నల్ల జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడుతూ దేశద్రోహం కేసు కింద నోటీసులు ఇవ్వడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, ప్రశ్నించే గొంతులను అణచివేయడమేనని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కులు, వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడాలని, ఇలాంటి చర్యలకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. దేశంలో సెక్యులరిజం, ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కుర్ర వెంకన్న, రెంటాల యాదగిరి, వీర్ల వెంకట అప్పారావు, కందుల స్వామి, తోకల పెద వెంకన్న, తోకల చిన్న వెంకన్న, శీలం శ్రీను, గుమ్మడి వీరబాబు, అవిలేని వెంకన్న, రెంటాల రామదాసు, కొట్టే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అద్భుత ఫలితాలతో గ్లోబల్స్ జేవీఆర్ ఆరంగేట్రం


### ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన గ్లోబల్స్ జేవీఆర్ కళాశాల

### జూనియర్ ఇంటర్ లో రాష్ట్ర స్థాయి మార్కులు

### మండలంలో మొదటి స్థానం కైవసం

### ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

### గ్లోబల్స్ జేవీఆర్ కరస్పాడెంట్ మహ్మద్ ఎర్షాద్ అహ్మద్





**కూసుమంచి, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్స్ జేవీఆర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రస్థాయి మార్కులు సాధించి సత్తాచాటారు. నియోజకవర్గగం లో మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేశారు. జూనియర్ ఇంటర్ లో 85శాతం ఉత్తీర్ణతతో విజయ దుంధుబి మోగించించారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో వనం పూజిత 470 మార్కులకు గాను 466 సాధించి మండలంలో మొదటి స్థానం కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో, జిల్లాలోని మొదటి పది స్థానాల్లో నిలిచింది. కళాశాలకు చెందిన దేగల గన శ్యామ్ 459/470, వీరబోయిన లోహిత 447/470, బైపీసీలో ఎండీ అస్మా షాగుప్తా 417/440, ఎండీ అద్నాన్ 404/440 మార్కుల సాధించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో చింతలపాటి కార్తీక్ 970/1000, వాచేపల్లి భావన 968/1000 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్ 87 శాతం ఉత్తీరణ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాడెంట్ ఎండీ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ.. కళాశాల నిర్వహణ బాధ్యతలు స్వీకరించిన మొదటి సంవత్సరంలో అత్యద్భుత ఫలితాలు సాధించడండంతో పాటు రాష్ట్ర స్థాయిలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. కార్పొరేట్ కళాశాలలో పనిచేసిన అధ్యాపకులను తీసుకొచ్చి కళాశాలలోని పేద, మధ్య తరగతి విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నామని తెలిపారు. కళాశాలను ఆదరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇదే ఒరవడితో మున్ముందు మంచి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్వేరోస్ కొండ్రు రామచంద్రుకి అరుదైన గౌరవం

### ఆయన చేసిన విశిష్ట సేవలకు గాను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ అవార్డు కు ఎంపిక...



**తిరుమలాయపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొండ్రు రామచంద్రుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డు రావడం గ్రామానికే కాకుండా మొత్తం ప్రాంతానికే గర్వకారణంగా నిలిచింది. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన, తన వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా సమాజాన్ని కూడా ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో సేవా మార్గాన్ని ఎంచుకున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయన చేసిన సేవలు పరిశీలిస్తే, అది కేవలం సహాయం చేయడం కాదు, ఒక బాధ్యతగా భావించి చేసిన కృషి అని స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామంలో ఎవరైనా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పుడు, వైద్య అవసరాలు వచ్చినప్పుడు, విద్య కోసం సహాయం అవసరమైనప్పుడు---తనకు ఉన్న పరిమితుల మధ్యే అయినా ముందుకు వచ్చి సహాయం చేసిన వ్యక్తిగా రామచంద్రుకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, పేద విద్యార్థులకు తోడ్పాటు ఇవ్వడం, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ఆయన సేవా స్ఫూర్తికి నిదర్శనం. ఇలాంటి నిస్వార్థ సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ, ఆయనను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జాతీయ అవార్డుకు ఎంపిక చేయడం ద్వారా సమాజానికి సేవ చేసే వారికి ప్రోత్సాహం అందించింది. ఈ అవార్డు కేవలం ఒక వ్యక్తికి మాత్రమే కాదు, సమాజ సేవ పట్ల ఉన్న విలువలకు ఇచ్చిన గౌరవంగా భావించవచ్చు. ఈ నెల 19న హైదరాబాద్‌లోని భాగ్ లింగంపల్లిలో ఉన్న సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందజేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా రామచంద్రు వంటి సేవామూర్తుల కృషి మరింత మందికి తెలిసి, యువతలో సేవా స్ఫూర్తి పెంపొందుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రఘునాథపాలెం గ్రామ ప్రజలు, ఆయన స్నేహితులు, కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయన భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షిస్తున్నారు.

## తిప్పారెడ్డిగూడెంలో ఘనంగా రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

### గ్రామస్తుల సహకారం తో ఆరు నెలల్లో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తున్న గ్రామ పెద్దలు



**తిరుమలాయపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** మండల పరిధి లోని తిప్పారెడ్డిగూడెం గ్రామం లో ప్రజల చిరకాల కోరికను సహకారం చేసేందుకు గ్రామ పెద్దలు రామాలయాన్ని నిర్మించడానికి కంకణ బద్ధులై ఆలయ నిర్మాణానికి గ్రామస్తుల సహకారంతో సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు గ్రామాల్లోని పుసులూరి రమేష్ బేబీ,పుసులూరి శ్రీనివాస్ సునీత, పుసులూరి రాకేష్.సుగుణ, పుసులూరి కృష్ణయ్య మంగతాయి, పుసులూరి రాము మమత, పుసులూరి మధు సృజన దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శంకుస్థాపన కార్యక్రమాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో సాగింది గ్రామస్తులంతా జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ శంకుస్థాపన కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలు నిర్వహించి దేవాలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన పుసులూరి రజిని జ్ఞాపకార్థం ఆమె కుమారుడు ఎన్నారై పుసులూరి సాకేష్ మూడు గుంటలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు అంగీకరించినట్లు వారు తెలిపారు.పుసులూరి యేసయ్య జ్ఞాపకార్థం అతని కుటుంబ సభ్యులు 30 గజాల స్థలాన్ని రామాలయానికి కేటాయించారు అని వారు తెలిపారు. రామాలయ నిర్మాణానికి గ్రామస్తులంతా సహకరించినట్లయితే ఆరు నెలల్లో రామాలయాన్ని పూర్తి చేస్తామని గ్రామ పెద్దలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంభం ఉపేందర్ ఉప సర్పంచ్ పుసులూరి రమేష్, అచ్చ బాబు, పోట్ల వాసయ్య, అచ్చ ఉప్పలయ్య మాజీ సర్పంచ్ వేల్పుల వీరన్న, వేల్పుల సైదులు, ఎల్దా శోభన్ రావు పోలే పొంగు ఉప్పలయ్య ఎంఎల్, పుసులూరి శ్రీనివాస్, సంగె పొంగు శ్రీను, వేల్పుల వెంకటేష్, పిడమర్తి రాజేష్,పేరం వెంకటేశ్వర్లు గోకినపల్లి వెంకన్న వేద పండితులు అర్చకులు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# నీటి తరలింపు పట్ల గ్రామస్తుల ఆగ్రహం

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన మధురానగర్ తండా వాసులు

## పోలీస్ స్టేషన్ లో పలువురిపై సర్పంచ్ ఫిర్యాదు




**కారేపల్లి, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** భజ్యా తండా గ్రామపంచాయతీకి సంబంధించిన మంచినీటి బోర్ నీళ్లను ఓ కాంట్రాక్టర్ తన సీసీ రోడ్ల అవసరాలకు అక్రమంగా తరలించడంపై మధురానగర్ తండా గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.భజ్యా తండా సర్పంచ్ ప్రోత్సాహంతోనే కాంట్రాక్టర్ తన వ్యక్తిగత రోడ్లకు వాడుకుంటూ మంచినీళ్లను దుర్వినియోగం చేస్తున్నాడని,ఇతర ప్రాంతాలకు సైతం గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారానే తరలిస్తున్నారని ఆరోపిస్తూ తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.గ్రామస్తుల ఫిర్యాదుపై స్పందించిన ఎంపీడీవో శ్రీనివాసరావు సర్పంచ్ హనుమంతరావుతో మాట్లాడి నీళ్లను బయటికి తరలించడానికి వీలులేదని ఆదేశించారు.అనంతరం సర్పంచ్ పోలీస్ స్టేషన్లో చేసిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని ఎస్సై బైరు గోపి గ్రామస్తులతో మాట్లాడారు.సమస్యను జటిలం చేసుకోకుండా గ్రామాలను అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని, గ్రామస్తులు పరస్పరం సహకరించు కోవాలని సూచించారు. గ్రామస్తులు ఉప సర్పంచ్ మోహన్ రావు,భూక్యా మోతిలాల్, రాందాస్, లకావత్ కళ్యాణ్, పలువురు వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలకు పిండిప్రోలు హైస్కూల్ పూర్వ విద్యార్థుల చేయూత

**తిరుమలాయపాలెం ఏప్రిల్ 13 (మనం న్యూస్)** చేయి చేయి కలిస్తేనే చప్పట్లు మోగుతాయి.. చినుకు చినుకు కలిస్తే వరదై, వరదలే కాస్త వేరులై, అవి కాస్త నదులవుతాయి. అలాగే పూర్వ విద్యార్థులందరూ కలిస్తే ఎలాంటివారికైనా ఆర్థికంగా చేయూతనివ్వచ్చని నిరూపిస్తున్నారు 1994 95 పూర్వ విద్యార్థులు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల పిండిప్రోలు గ్రామంలో 1994 1995 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులందరూ ఐక్యంగా నిలబడి తోటి విద్యార్థి మిత్రులు అనుకోని పరిస్థితుల్లో చనిపోయినప్పుడు వారి కుటుంబానికి ఆసరాగా నిలుస్తున్నారు. 2009లో 1994-95 బ్యాచి మొదటి పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాఠశాలలో జరిగింది. 2013లో జనవరిలో 94-95 బ్యాచ్ రెండోసారి పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఒక వేదిక నిర్మించుకోవాలని గొప్ప ఆలోచన ఉద్భవించింది. అనుకున్నదే తడవుగా 1,50,000తో ఈ వేదికను పూర్తి చేశారు. 2019లో తోటి మిత్రుడు పెరుగు ఉపేందర్ అకాల మరణానికి గురయ్యారు. మళ్లీ పూర్వ విద్యార్థులందరూ ఏకమై ఈ సందర్భంగా ఉపేందర్ కూతురికి ఆర్థిక సహాయంగా 42 వేల రూపాయలను ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగింది. ఈ అమౌంటు అమ్మాయి పెళ్లికి ఎంతో ఉపయోగపడ్డాయి. ఇటీవల కాలంలో ఐతనబోయిన రవికుమార్



కూడా చనిపోయారు. మళ్లీ టెన్త్ బ్యాచ్ విద్యార్థులు అందరూ తలా ఒక చేయి వేసి రవికుమార్ కూతురు ఐతనబోయిన మైత్రి పేరుమీద 26వేలను పిండిప్రోలు ఐఓబి బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండును వారి కుటుంబానికి అందజేశారు. ఇలాంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న 1994-95 బ్యాచ్ విద్యార్థులు ఇతర బ్యాచ్ విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో మీగడ సైదులు, మేకల సత్యనారాయణ, మడికంటి స్కైలాబ్, రామనబోయిన వెంకటేశ్వర్లు, తోము వెంకటేశ్వర్లు, భాషణ బోయిన వీరభద్రం తదితరులు ఉన్నారు.

# భద్రత ప్రమాణాలు పాటిస్తేనే గమ్యం చేరుకుంటాం




## ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13(మనం న్యూస్)** భద్రత ప్రమాణాలు పాటిస్తేనే వాహనదారులు గమ్యం చేరుకోగలరని తిరుమలా యపాలెం ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ తెలిపారు సోమవారం సోమవారం మండల కేంద్రంలో రోడ్ల భవనాల శాఖ ఆర్ అండ్ బి, ఎన్ హెచ్ మీ భద్రత మా ఆధ్వర్యంలో మీ భద్రత మా లక్ష్యం అని అవగాహన సదస్సు జరిగింది ఈ సందర్భంగా ఎంపీడీవో షేక్ సిలార్ సాహెబ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా సురక్షితంగా గమ్యం చేరడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ నిర్వహిస్తున్న "అరైవ్ ఆలైవ్" రోడ్డు భద్రత అవగాహన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని రోడ్డు భద్రత నియమాలపైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయన్నారునిర్ణీత వేగ పరిమితిని పాటించడం ద్వారా మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా రక్షించవచ్చని అన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం, ఓవర్ టేక్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. "సురక్షిత ప్రయాణం -- సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ కలిసి పని చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ పి హరీష్ ఎల్ వెంకటేశ్వర్లు వెంకటేష్ సౌజన్య ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ మాజీ సర్పంచ్ లు బిక్షం నాయక్ మందుల వెంకన్న గంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు

మనం



# వైరా

వైరా - కారేపల్లి - కొణిజర్ల - ఏన్కూరు - జూలూరుపాడు

## మహిళపై మాజీ కౌన్సిలర్ భర్త దాడి

### వైరా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



**వైరా, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** వైరా మున్సిపాలిటీ పదో వార్డు గండగలపాడులో పొన్నెకంటి కుసుమాంబ అనే మహిళ పై అదే వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ భర్త, కాంగ్రెస్ పార్టీ టౌన్ నాయకులు కర్నాటి హనుమంతరావు అతని తమ్ముడు రవి ఇద్దరు కలిసి మహిళపై దాడి చేశారని వైరా పోలీస్ స్టేషన్ లో సోమవారం పిర్యాదు చేశారు. ఈ దాడిలో గాయపడిన కుసుమాంబ కు తీవ్ర గాయాలు అయ్యాయి. తమ కుటుంబం పై వ్యక్తిగత కక్షలు పెంచుకున్న మాజీ వార్డు కౌన్సిలర్ భర్త హనుమంతరావు తమ్ముడు రవి కలిసి తన కుమారుడు సునీల్ ని అకారణంగా కొడుతుండగా తండ్రి సత్యనారాయణ తల్లి కుసుమాంబ భార్యాభర్తలు నా కుమారుడిని ఎందుకు కొడుతున్నారని నిలదీయడంతో అసభ్య పదజాలాలతో దూషించి చెప్పుతో కొట్టి తీవ్రంగా గాయపరిచారని ఫిర్యాదులో తెలిపారు. చికిత్స కొరకు వైరాలోని ప్రైవేట్ ఆస్పత్రిలో ఎక్స్ రే తీసి చికిత్స చేసిన డాక్టర్ చేయి ఫ్యాక్చర్ అయిందని తెలిపారని , తమను అకారణంగా దుర్భాసలాడి గాయపరిచిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కుసుమాంబ డిమాండ్ చేశారు.


## మహానుభావుడి విగ్రహం శుభ్రం చేయడం అదృష్టం : ఎస్ఐ రామారావు



**వైరా, ఏప్రిల్ 13 (మనం న్యూస్ ):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శు భ్రం చేయటం నా జీవితం ధన్యమైందని అలాగే మహానుభావులు విగ్రహం శుభ్రం చేయడం నా అదృష్టమని వైరా ఎస్సై పుష్పాల రామారావు అన్నారు. సోమవారం వైరా మున్సిపాలిటీలోని ఎనిమిదవ వార్డులో ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా ముందస్తు ఏర్పాట్లలో భాగంగా అంబేద్కర్ విగ్రహాన్ని వైరా ఎస్సై పుష్పాల రామారావు, 8వ వార్డు కౌన్సిలర్ చిలక చిన్నకోటయ్య కలసి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానుభావుని విగ్రహాన్ని పరిశుభ్రంగా కడిగే భాగ్యం నాకు కలగటం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో నందిగామ మనోహర్, గద్వాల రవీందర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ఆర్టీఐను నిర్వీర్యం చేస్తున్న అధికారులు

**కొణిజర్ల, ఏప్రిల్ 13(మనం న్యూస్):** కొణిజర్ల మండల పరిధిలో ఆర్టీఐ చట్టాన్ని అధికారులు నిర్వీర్యం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. కొణిజర్ల గ్రామానికి చెందిన ఓ ఆర్టీఐ కార్యకర్త కొణిజర్ల గ్రామ పంచాయతీకి సంబంధించిన సమాచారాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, గతంలో పనిచేసిన గ్రామ సెక్రటరీ రికార్డులు అందుబాటులో లేవని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.ప్రమోషన్ దశలో ఉన్న సదరు సెక్రటరీ, బాధ్యతల నుంచి రిలీవ్ అవుతాననే ఉద్దేశంతో సమాచారం ఇవ్వలేదని ఆర్టీఐ కార్యకర్త ఆరోపించాడు. ఈ విషయంపై గత ఏడాది డిసెంబర్ 23న డిపివోకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నాడు.తర్వాత బాధ్యతలు స్వీకరించిన గ్రామ సెక్రటరీ బి. రవికుమార్ కు మళ్లీ అదే అంశంపై ఆర్టీఐ దరఖాస్తు చేసుకోగా, ఈసారి అన్ని రికార్డులు అందుబాటులో ఉన్నాయని


PANCHAYAT SECRETARY
G.P KONIJERLA

సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. దీంతో ముందుగా ఇచ్చిన సమాధానంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని త్వరలో ఆర్టీఐ కమిషనర్ కు ఫిర్యాదు చేయబోతున్నట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఆర్టీఐ కార్యకర్త మాట్లాడుతూ, ప్రతి పౌరుడికి సమాచారం తెలుసుకునే హక్కు కల్పించేందుకే ప్రభుత్వం ఆర్టీఐ చట్టాన్ని తీసుకువచ్చిందని అన్నారు. తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను తప్పుదారి పట్టించే అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం.



# మధిర

మధిర - ఎర్రుపాలెం - బోనకల్- చింతకాని - ముదిగొండ

## మండలంలో పలు బిటి రోడ్లు మంజూరు

### తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి మండల కాంగ్రెస్ కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు

**ఎర్రుపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** మండల పరిధిలో మేనవోలు నుండి బనిగండ్లపాడు వరకు 2 కోట్లు భీమవరం విద్యానగర్ నుండి గంగదేవపాడు ప్రాజెక్టు వరకు 3 కోట్ల 90 లక్షలు రామన్నపాలెం నుండి కట్లేర్ రివర్ వరకు 2 కోట్లు రోడ్లు అయ్యాయి. వీటిని మంజూరి చేసినందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లుకి మండల కాంగ్రెస్ కమిటీ తరపున మండల అధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.





## శ్రీ ఆదర్శలో టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు

**చింతకాని, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం జరిగింది. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ సూచించారు. విద్యార్థులు సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ , అకుంఠిత దీక్ష, ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగినప్పుడు అనుకున్న గమ్యాన్ని చేరుతారని ఆయన తెలిపారు. విద్యార్థులు పాఠశాల తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొన్నారు . ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోళ్ల రేణుక, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పందిరి పుల్లారావు, సుధాకర్, ప్రశాంతి, పార్వతి, సుజాత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ వెలుగు.. మా జీవితంలో చీకటి..

### 6వ రోజుకు చేరిన కరెంటోళ్ల సమ్మె..

**మధిర, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** అందరి జీవితాలలో వెలుగు నింపుతున్నా ఏళ్లుగా సమస్యలకు పరిష్కారం లేక విద్యుత్ ఉద్యోగుల జీవితం చీకటిగా మారిపోతుందని ఎస్పీ డిసిఎల్ కంపెనీ యూనియన్ ట్రేసర్ మాణిక్యరావు అన్నారు. టీవీఏఈ జేఏసీ రాష్ట్ర నాయకుల ఆదేశాల మేరకు పట్టణంలో ఆర్టిజన్స్ కార్మికుల సమ్మె సోమవారం కూడా కొనసాగింది. తమ డిమాండ్లను నెరవేర్చే దాకా ఈ సమ్మె కొనసాగు తుందని ఉద్యోగులు తెలియజేస్తున్నారు. విద్యుత్ శాఖలో సుదీర్ఘకాలం నుండి కనీస వేతనాలు కూడా లేకుండా పనిచేస్తున్న సబ్ స్టేషన్ ఆపరేటర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఆఫీస్ అసిస్టెంట్, వాచ్మెన్ గా వివిధ రూపాల్లో పని చేస్తున్న ఆర్టిజన్స్, అన్ మ్యాన్ మరియు పీస్ రేట్ కార్మికులు వారి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆరవ రోజు కూడా సమ్మె కొనసాగిస్తున్నారు. మధిర విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయ ప్రాంగణం బయట ఏర్పాటుచేసిన శిబిరంలో విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె కొనసాగించారు. సమ్మె చేస్తున్న ఆర్టిజన్స్ మరియు అన్మాండ్ కార్మికులకు మద్దతుగా మధిర సిపిఎం పార్టీ, సిఐటియు లతోపాటు విద్యుత్ శాఖలో ప్రధాన ట్రేడ్ యూనియన్స్ అయినా 327 యూనియన్ మరియు 1104 యూనియన్ ప్రధాన బాధ్యులు వచ్చి సంఘీభావం తెలియజేశారు.



## ఎస్బిఐ సేవలను సద్వినియోగం చేసుకోండి

### ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్

**చింతకాని, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బిఐ రీజనల్ మేనేజర్ రాజశేఖర్ మండల ప్రజలకు సూచించారు. మండల పరిధిలోని పందిళ్ళపల్లి గ్రామంలో మంగళవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పందిళ్ళపల్లి బ్రాంచ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా జీవితంలో పొదుపు అనేది చాలా ముఖ్యమన్నారు. ప్రతి ఒక్కరు తమ ఆర్థిక అవసరాలు నిమిత్తం బ్యాంకుల్లో పొదుపు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక, విద్యుత్, ప్రణాళిక ప్రణాళిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క చొరవతో పందిళ్ళపల్లికి ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. మానవ జీవితంలో పొదుపు చేయడం అత్యంత ఆవశ్యకత కూడుకొని ఉన్నదన్నారు. ప్రజలు తమ ఆర్థిక అవసరాలకు బ్యాంకుల్లో నగదును పొదుపు చేయడం ఎంతో ఉపయోగకరమని ప్రజలందరూ తమ సంపాదనలో కొంత మొత్తం పొదుపు చేసి ఆర్థిక అవసరాలకు సరైన సమయంలో లబ్ధి పొందాలని సూచించారు. ఖాతాదారులు బ్యాంకుల్లో పొదుపు చేయడంతో పాటు అవసరానికి అనుగుణంగా రుణం తీసుకుని సకాలంలో ఆ రుణాలు చెల్లించినప్పుడు బ్యాంకులు సమర్థవంతంగా పని చేయుటకు అవకాశం ఉంటుందన్నారు. పందిళ్ళపల్లిలో ఎస్బిఐ బ్రాంచ్ ఏర్పాటు లింగం రాంబాబు ఎంతగానో కృషి చేశారని గ్రామం పట్ల ఆయనకున్న నిబద్ధతను కొనియాడారు. పందిళ్ళపల్లి గ్రామం తో పాటు బొప్పారం, గాంధీ నగర్, అనంతసాగర్, మత్తేపల్లి, రామకృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు నూతనంగా ఏర్పాటు



చేసిన ఎస్బిఐ సేవలను ఉపయోగించుకొని లబ్ధి పొందాలని ఆకాంక్షించారు. ప్రజల ఆర్థిక అవసరాల నిమిత్తం ఎస్బిఐ బ్యాంకు ఎన్నో వినూత్న పథకాలను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆనం ప్రభాకర్ రెడ్డి, బ్యాంకు మేనేజర్ నిషార్, చీఫ్ మేనేజర్లు ఫయాద్, రాంబ్రహ్మం, శ్రీలక్ష్మి , క్యాషియర్ హఫీజ్ భాష, చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు లింగం రాంబాబు, గాంధీనగర్ గ్రామ సర్పంచ్ ఓర్సు వీరభద్రం, బొప్పారం గ్రామ సర్పంచ్ ఎస్.కె రహమతుల్లా, కాంగ్రెస్ నాయకులు బందెల నాగార్జున, కంచం కోటేశ్వరరావు, గాదె రామారావు, వంగూరి రమేష్, ఇనుకుళ్ళ నాగ సూరారెడ్డి, దేవరపల్లి సుధాకర్ రెడ్డి, కిలారు వెంకటేశ్వర్ రెడ్డి, కొమ్మినేని నాగేశ్వరరావు, గుండా సత్యనారాయణ, సిపిఎం నాయకులు వత్సవాయి జానకి రాములు, బిఆర్ఎస్ నాయకులు మేకల ప్రసాద్ రావు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలి : మధిర రూరల్ సిఐ మధు

**మధిర, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని మధిర రూరల్ సిఐ మధు అన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం నుంచి 18వ తేదీ వరకు 'అరైవ్–అలైవ్' కార్యక్రమాల నిర్వహణలో భాగంగా సోమవారం మధిర రూరల్ మండలం మాటూరు గ్రామలో అవగాహన కార్యక్రమం నిర్వహించి హెల్మెంట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు కూడా సరైన హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. – ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్‌టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. భారీ వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు ఎడమ వైపున, మిగిలినవి కుడి వైపున



నడపాలన్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయరాదని, వాహనాలపై రేడియస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షిత ప్రయాణం చాల కీలకమని పేర్కొన్నారు. సురక్షితంగా రోడ్డు దాటడం కోసం పాఠశాలలు, పార్కుల దగ్గర రోడ్లపై "నెమ్మదిగా నడపండి" అనే సైన్ బోర్డులను గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మి భార్గవి, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ





**మధిర టౌన్, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక కృషి, నిరంతర శ్రద్ధ ఫలితంగా మధిర పట్టణం మరియు మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు మధిర మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయము నందు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర పట్టణం, మండల లబ్ధిదారులు పాల్గొని తమకు అందిన ఆర్థిక సహాయంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమకు కష్టకాలంలో ప్రభుత్వం అందించిన ఈ సహాయం ఎంతో ఉపయుక్తంగా ఉందని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రతి అర్హుడికి సహాయం అందేలా కృషి చేస్తున్న భట్టి విక్రమార్క సేవలు అభినందనీయం అని స్థానిక నాయకులు, ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, మండల కాంగ్రెస్ నాయకులు నిడమనూరు వంశీకృష్ణ, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్ , బీసీ సెల్ అధ్యక్షుడు బిట్రా ఉద్దండయ్య,పట్టణ కాంగ్రెస్ నాయకులు కోటా డేవిడ్ నాగపోయిన రామారావు, సువర్ణ కంటి రామకృష్ణ, మైలవరపు చక్రి, దూదేకుల జానీ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సాయిస్ఫూర్తిలో 'ప్లేస్మెంట్ విజయోత్సవ సభ-2026'

**88 మంది విద్యార్థులకు క్యాంపస్ సెలక్షన్స్ లో ఉద్యోగాలు.**

**తల్లిదండ్రులను సత్కరించిన కళాశాల యాజమాన్యం.**

**వచ్చే ఏడాది నుంచి 100% ప్లేస్‌మెంట్స్ కోసం ప్రత్యేక శిక్షణ: చైర్మన్ బండి పార్థసారథి రెడ్డి**




**సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల లో సోమవారం 'ప్లేస్మెంట్ విజయోత్సవ సభ-2026' అత్యంత వైభవంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ వూటుకూరి శేషారత్నకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. నాయకత్వ లక్షణాలతో ఎదగాలి: ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ నాలుగు ఏళ్ల కాలాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించడం గర్వకారణమని అన్నారు. కేవలం ఉద్యోగులుగానే కాకుండా, పని చేసే చోట టీమ్ లీడర్లుగా, బాధ్యత గల వ్యక్తులుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ విద్యార్థులకు సాంకేతికతతో చేయూత: సెక్రటరీ ప్రభాకర్ రెడ్డి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థులు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుని బహుళజాతి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఉద్యోగాలు సాధించిన 88 మంది విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల సమక్షంలో సత్కారం పొందడం చూసి పలువురు భావోద్వేగానికి లోనయ్యారు. ప్రత్యేక శిక్షణ తరగతులు: చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి హెటిరో ఫార్మాస్యూటికల్ అధినేత, రాజ్యసభ సభ్యులు కళాశాల చైర్మన్ లిలిడాక్టర్ శ్రీ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి తమ కంపెనీల అనుసంధానంతో 100% ప్లేస్‌మెంట్స్ సాధించేలా ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని వారు హామీ ఇచ్చారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డి.ఎన్.వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, మొత్తం 88 మంది విద్యార్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారని, వీరు తమ చివరి సెమిస్టర్ పరీక్షల అనంతరం విధుల్లో చేరుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాల అధిపతులు ( హెచ్ ఓ డి ), ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు నిర్వహిద్దాం

**మాల మల్లయోధుల కమిటీ ఆధ్వర్యంలో భారీ ద్విచక్ర వాహన ర్యాలీ**



**సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక విప్లవకారుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని సత్తుపల్లి పట్టణంలో మంగళవారం వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మాల మల్లయోధుల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిల్లి కవితా మల్లిక్ , బోడా వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా సత్తుపల్లి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. స్థానిక జవహర్ నగర్‌లోని కొమ్మేపల్లి కాలనీ నుండి పట్టణ ప్రధాన వీధుల గుండా భారీ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించబడుతుంది. ర్యాలీ అనంతరం జ్యోతి నిలయం వద్ద మాల మల్లయోధుల కమిటీ భవిష్యత్ కార్యక్రమాలు, సామాజిక పోరాటాలపై కీలక సమావేశం జరుగుతుంది. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మాట్లాడుతూ, అంటరానితనం నిర్మూలన, కుల వ్యవస్థ అంతం, మరియు మహిళా సాధికారత కోసం అంబేద్కర్ చేసిన కృషిని స్మరించుకున్నారు. "దేశ మొదటి న్యాయశాఖ మంత్రిగా సామాజిక న్యాయం, విద్య, కార్మిక హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. నేడు దేశవ్యాప్తంగా అంబేద్కర్ వాదం విస్తరించింది. ఆయన అందించిన రాజ్యాంగ ఫలాల వల్లే నేడు మనం గౌరవప్రదమైన జీవితాన్ని గడుపుతున్నాం. అయితే, ప్రస్తుత పాలకులు 'విభజించు-పాలించు' అనే ధోరణితో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అంబేద్కర్ ఆశయ సాధన కోసం మనమంతా ఐక్యంగా పోరాడాలని" వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అంబేద్కర్ అభిమానులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# కల్లూరు విద్యార్థినికి స్టేట్ ర్యాంక్

**విద్యార్థినిని అభినందించిన బిజెపి మండల అధ్యక్షులు గుమ్మ రామకృష్ణ**



**కల్లూరు ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్రంలో ఏప్రిల్ 12న విడుదల చేసిన ఇంటర్ ఫలితాల్లో స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన కల్లూరు విద్యార్థిని సానిక లక్ష్మీ సంజన(436/440)ని మండల బిజెపి అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ బిజెపి నాయకులతో కలిసి శాలువతో సత్కరించి అభినందించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని ఖాన్ ఖాన్ పేట కి చెందిన సానిక శ్రీనివాసరావు, ఉషారాణి దంపతుల కుమార్తె సానిక లక్ష్మీ సంజన ఇంటర్ ఫలితాల్లో బైపీసీ మొదటి సంవత్సరం స్టేట్ రెండవ ర్యాంకు సాధించడంతో విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు వారి స్వగృహానికి వెళ్లి విద్యార్థిని ఆశీర్వదించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షుడు గుమ్మ రామకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్తులో మరెన్నో ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. గతంలో పదో తరగతి ఫలితాల్లో కూడా స్కూల్ ఫస్ట్, మండల రెండవ ర్యాంకు సాధించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం సంజన తను చదువుతున్న ఖమ్మం పట్టణంలోని శ్రీ చైతన్య కళాశాలలో మొదటి సంవత్సరం క్యాంపస్ మొదటి స్థానాన్ని దక్కించుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంటర్ ఫలితాలు స్టేట్ 2వ ర్యాంకు సాధించి మండలానికి అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చిందని అందుకు మండల ప్రజలు గర్వించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మండవ వెంకటరామిరెడ్డి, పానుగంటి కృష్ణయ్య, తుమ్మలపూడి పెద్ద పుల్లారావు, గుండపనేని అనిల్, జంగిల్ దుర్గాప్రసాద్, జరుపుల నాగులు, భూక్య రాజ్ కుమార్,కేలోత్ కృష్ణ,త దితరులు, పాల్గొన్నారు

# మనం




# సత్తుపల్లి

సత్తుపల్లి - వేంసూరు - పెనుబల్లి - కల్లూరు - తల్లాడ

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత..

**తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ..**



**తల్లాడ, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటకృష్ణ సూచించారు. సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా తల్లాడ మండలంలోని నూతనకల్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు ఏకగ్రతతో ఉండాలని సూచించారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ వేరే ధ్యాసలో ఉంటూ డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరుగుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేశుల రవి, కళ్యాణపు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండలంలో మంత్రి పొంగులేటి పర్యటన..



**తల్లాడ, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** రాష్ట్ర రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం తల్లాడ మండలంలో పర్యటించనున్నారు. తొలుత బాలపేట గ్రామపంచాయతీ నూతన భవనం ప్రారంభించడంతోపాటు తల్లాడ పట్టణంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అంబేద్కర్ భవనాన్ని 50 లక్షల రూపాయలతో నిర్మించారు. కాంట్రాక్టర్ వెదురు కృష్ణారెడ్డి ఈ భవనాన్ని నిర్మించారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## 7 రోజుల్లో 12 ప్రమాదాలు.. 10 మంది మృతి...



**సత్తుపల్లి రూరల్ ఏప్రిల్ 13, (మనం న్యూస్) :** ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి-ఖమ్మం 60 రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. గత 7 రోజుల్లోనే 12 ప్రమాదాలు జరిగి, 10 మంది, అందులో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు యువకులు, ప్రాణాలు కోల్పోయారు. జాతీయ రహదారి అయినప్పటికీ రోడ్డు ఇరుకుగా ఉండటం, బొగ్గు, ఇసుక లారీల రద్దీ పెరగడమే దీనికి కారణమని తెలుస్తోంది. కొణిజర్ల వద్ద జరిగిన ప్రమాదంలో రాజమండ్రికి చెందిన దంపతులు మృతి చెందగా, వారి కుమారుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. ఈ రహదారిని తక్షణమే నాలుగు వరుసల రహదారిగా విస్తరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు...

## ప్రతిజ్ఞ చేయడమే కాదు ఆచరణలో చూపాలి..

**తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచన..**



**తల్లాడ, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** రోడ్డు భద్రత ఉత్సవాల్లో భాగంగా ప్రతిజ్ఞ చేయడమే కాకుండా ఆచరణలో చేసి చూపించాలని తల్లాడ తహశీల్దార్ కరుణాకర్ రెడ్డి సూచించారు. సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత ఉత్సవాలపై యువకులకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలపై డ్రైవింగ్ చేసేటప్పుడు కుటుంబం గురించి ఆలోచించాలని సూచించారు. డ్రైవింగ్ విషయంలో చిన్న పొరపాటు చేసిన పెను ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ రాజు, తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు చిన్నబ్బాయి, ఈఓ కృష్ణారావు, హెడ్ కానిస్టేబుల్ కేశవరావు, ఆర్ఐ కాజా మోహినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు

# మనం కొత్తగూడెం

కొత్తగూడెం కార్పొరేషన్ - సింగరేణి

# కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి

- బిఎంఎస్ నేత నాగేశ్వరరావు
- జీఎం సివిల్ అధికారికి వినతిపత్రం

**కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 13(మనం న్యూస్):** భానుడి ప్రతాపం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎండలను దృష్టిలో పెట్టుకొని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని బిఎంఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్పొరేట్ జిఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సివిల్ రాజేంద్రప్రసాద్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ మజ్దూర్ సంగ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు మాట్లాడారు. వేసవి కాలం కావడంతో ఓసిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని అలాగే పారిశుధ్య కార్మికులు రోడ్స్ క్లీనింగ్ పార్కులలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మండుతున్న ఎండల సమయంలో ప్రతి సంవత్సరం కూడా మానవతా దృక్పథంతో అన్ని ఏరియాలలో కూడా ఉదయం 6 గంటలకే పని ప్రారంభించి మధ్యాహ్నానికి ఎండలు ముదిరే సమయానికి పని ముగించేలా పనివేళలు మార్పు చేస్తారని ఈ సంవత్సరం కూడా అలా సహకారాన్ని కొనసాగిస్తూ పనివేళలో మార్పు చేయాలని కోరారు. అలాగే వివిధ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న అన్ని



విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ప్రైవేటు వాహన డ్రైవర్లకు కోల్ ట్రాన్స్పోర్ట్ ఓబి వర్కర్స్ కు మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని వర్కర్లకు సంబంధించి పని ప్రదేశాలలో చలవ పందిల్లు ఏర్పాటు చేయాలని ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని వడదెబ్బ నుండి కాపాడుకునేలా సీజనల్ వ్యాధులు వల్ల అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, కళ్యాణ్ చక్రవర్తి, అశ్విని, నాహిద్, అరుణ, జయ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత వారోత్సవాలలో పాల్గొన్న కొత్తగూడెం నగరపాలక సంస్థ మేయర్ మూడ్ గణేష్



**కొత్తగూడెం క్రైమ్, ఏప్రిల్ 13, ( మనం న్యూస్ ) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన "ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక"( 99 రోజుల యాక్షన్ ప్లాన్) కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం లో మేయర్ గణేష్ గారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని తద్వారా ప్రమాదాలను తగ్గించడం, మరియు ప్రాణాలను రక్షించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం మరియు మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి అంశాలు ప్రజలకు తెలియజేసారు. ఈ యొక్క కార్యక్రమం లో 1వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ కరుణాకర్ గారు,3వ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్ర సేన రెడ్డి గారు, ట్రాఫిక్ ఎస్ఐ గద్దం ప్రవీణ్ కుమార్ గారు, వీజు× అశోక్ కార్పొరేటర్లు, వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు, ప్రజలు తదితరులు పాల్గొన్నరు

## సింగరేణి రక్షణకై హైదరాబాదుకు కదిలి రండి

– సిఐటియు నేత మంద నరసింహారావు



**కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 13(మనం న్యూస్):** సింగరేణి రక్షణకై ఈనెల 28న చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మంద నరసింహారావు పిలుపునిచ్చారు. కొత్తగూడెం మెయిన్ వర్క్ షాప్ లో బ్రాంచి కార్యదర్శి విజయగిరి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం జరిగిన పిట్ మీటింగ్ లో నరసింహారావు మాట్లాడుతూ సింగరేణికి రావాల్సిన 51 వేల కోట్ల బకాయిలకును రాబట్టేందుకు, ఓపెన్ కాస్ట్ లలో బొగ్గు తీసే పని సింగరేణి పర్మినెంట్ కార్మికులతో చేపట్టాలని, 40 సంవత్సరాలకు పైగా సింగరేణి కాపాడే ప్రాజెక్టు నైని బ్లాకులు ప్రైవేటు వారికి కాకుండా సింగరేణి కార్మికులతో బొగ్గు తీయాలని మంద నరసింహారావు పేర్కొన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యంని తగ్గించాలని తద్వారా సింగరేణి రక్షణ కొరకు ఈనెల 28న విద్యుత్ సౌదా ముట్టడి సెక్రటేరియట్ ముట్టడి ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సింగరేణి సంస్థను ఆర్థిక ఇబ్బందుల నుంచి రక్షించేందుకు కార్మికులందరూ కదిలి రావాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, గాజుల రాజారావు, గడల నరసింహారావు, అప్పారావు, సిఐటియు జిల్లా నాయకులు భూక్య రమేష్, టౌన్ నాయకులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యమే ప్రమాదాలకు మూలం

– 'అరైవ్ అలైవ్'తో ప్రజల్లో చైతన్యం

**సుజాతనగర్, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సుజాతనగర్ మండల పరిధిలోని పలు వార్డులు, గ్రామపంచాయతీలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను వివరించి, వాటిని కచ్చితంగా పాటించాలని సూచించారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్సై ఎం. రమాదేవి మాట్లాడుతూ, రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించినప్పుడే ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించగలమన్నారు. రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే అధిక శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన అత్యంత అవసరమని, అందుకే "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు మాత్రమే కాకుండా వెనుక కూర్చునే వారు కూడా హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందని, వాహనం నడిపేటప్పుడు సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని



సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. రక్షణాత్మక డ్రైవింగ్ అలవాటు చేసుకుని అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఎం. రమాదేవి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ రాకేష్, పోలీసు సిబ్బంది, శానిటరీ ఇన్స్పెక్టర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

# జీవితం విలువైనది... భద్రత మన బాధ్యత

– కార్పొరేటర్ మునిగడప పద్మ

**రామవరం, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ఆధ్వర్యంలో వాహనదారులతో హెల్మెట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన––ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అనేక కుటుంబాల్లో విషాదాన్ని మిగులుస్తున్నాయని పేర్కొంటూ, ట్రాఫిక్ నిబంధనలు ప్రాణ రక్షణ కోసం పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని హెచ్చరించారు. అతివేగం, ట్రాఫిక్ ఉల్లంఘనలు ప్రమాదాలకు దారితీస్తాయని, పాదచారులకు ప్రాధాన్యత ఇస్తూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని పిలుపునిచ్చారు. ఈ



సందర్భంగా ప్రజలతో ట్రాఫిక్ నియమాలను పాటించాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మునిగడప వెంకటేశ్వర్లు, జిత్తుక దిలీప్, గుంజ వెంకన్న, రామ్ రాకేష్, వాసం బాబు, సబ్బని పాపారావు, బి. శ్రీను, కందుకూరి గంగరాజు, అఖిల్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన

-- ప్రమాదాల నివారణే

ప్రధాన లక్ష్యం: జిల్లా కలెక్టర్ అంకిత్



**చుంచుపల్లి,ఏప్రిల్13(మనం న్యూస్) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం చుంచుపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీ-అడిక్షన్ మరియు కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు . రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు . ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను



తొలగించడం, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా, సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. కొన్ని జిల్లాల్లో అమలు చేస్తున్న "నో హెల్మెట్ -- నో ఎంట్రీ" వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని , వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్తులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నంద తండా గ్రామపంచాయతీలో అంగన్వాడి కేంద్రాల దయనీయ పరిస్థితి

– శాశ్వత భవనాల లేక చిన్నారుల ఇబ్బందులు

**చుంచుపల్లి,ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** చుంచుపల్లి మండలం నంద తండా గ్రామపంచాయతీ పరిధిలోని మూడు అంగన్వాడి కేంద్రాలు శాశ్వత భవనాల లేమితో తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. గ్రామంలోని మూడు అంగన్వాడి సెంటర్లు ఇప్పటికీ శాశ్వత భవనాలు లేకుండా ప్రాథమిక పాఠశాల గదులు మరియు ప్రైవేట్ కిరాయి ఇళ్లలో నిర్వహించబడుతున్నాయి. ఈ పరిస్థితి చిన్నారుల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ప్రభుత్వం పిల్లల పోషణ, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడి కేంద్రాలు సరైన సదుపాయాలు లేకుండా నడవడం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు కూర్చోవడానికి సరైన స్థలం లేకపోవడం, గాలి, వెలుతురు తక్కువగా ఉండటం, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ప్రాథమిక వసతులు లేకపోవడం వల్ల పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ కేంద్రాలు తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాల గదుల్లో మరియు ప్రైవేట్ కిరాయి భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో పాఠశాల పిల్లలకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, తరగతుల నిర్వహణలో అంతరాయం కలుగుతోందని స్థానికులు చెబుతున్నారు. కిరాయి భవనాలు కూడా చిన్నవిగా ఉండటంతో పిల్లలు ఇరుకైన గదుల్లో ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా వేసవి కాలంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, వర్షాకాలంలో నీటి లీకేజీలు వంటి సమస్యలు చిన్నారుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపడంలో కూడా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు సంబంధిత అధికారులను వెంటనే స్పందించాలని కోరుతున్నారు. నంద తండా గ్రామపంచాయతీలోని మూడు అంగన్వాడి కేంద్రాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**నంద తండా గ్రామపంచాయతీలో అంగన్వాడి భవనాలు లేక పిల్లలు ఇబ్బందులు**



అంతేకాకుండా రాబోయే స్కూల్ రీ-ఓపెనింగ్‌కు ముందే ఈ భవనాల నిర్మాణాన్ని పూర్తి చేసి చిన్నారులకు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాల అమలు గ్రామ స్థాయిలో సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షణ పెంచాలని కూడా వారు సూచిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుని అంగన్వాడి కేంద్రాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేస్తేనే చిన్నారుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని గ్రామ ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

## మనం కొత్తగూడెం నియోజకవర్గం

కొత్తగూడెం కార్పొరేషన్ - చుంచుపల్లి - లక్ష్మీదేవిపల్లి - సుజాతనగర్

# ప్రజా పాలనలో భాగంగా రోడ్డు భద్రతపై భారీ అవగాహన

-- హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి



**రామవరం, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్" లో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా ఏసీబీ నగర్ 14వ డివిజన్ మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, అలాంటి చర్యలను పూర్తిగా నివారించాలని పిలుపునిచ్చారు. అలాగే వేగ పరిమితులు పాటించడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపకపోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్‌ను కచ్చితంగా అనుసరించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువత, వాహనదారులు పెద్ద ఎత్తున పాల్గొని రోడ్డు నియమాలను పాటించాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రమాదాల నివారణతో పాటు ప్రాణ రక్షణే ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# సౌకర్యం దూరం...కష్టాలు దగ్గర..!

– గ్యాస్ మార్పు పై ప్రజల ఆందోళన

– సర్పంచ్ లావుడ్య పూర్ణ



**లక్ష్మీదేవిపల్లి ఏప్రిల్ 13 (మనం న్యూస్):** ఉమ్మడి రేగళ్ల పంచాయతీ గ్యాస్ కనెక్షన్ల మార్పు -- గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు లక్ష్మీదేవిపల్లి మండలం ఉమ్మడి రేగళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని రేగళ్ల, పెద్ద తండా, బావోజీ తండా, హరియ తండా, దుద్యా తండా గ్రామాలకు చెందిన ప్రజలు గత 20 సంవత్సరాలుగా సత్యసీల్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఇండియన్ గ్యాస్ సేవలను పొందుతున్నారు. పంచాయతీలో సుమారు 2000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. అయితే, ఈ సంవత్సరం జనవరి నెలలో ఈ కనెక్షన్లను ఆళ్లపల్లి మండలంలోని శ్రీ సమ్మక్క సారక్క గ్యాస్ ఏజెన్సీకి మార్చడం జరిగింది. ఈ ఏజెన్సీ సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ సిలిండర్ తీసుకురావడానికి దూర ప్రయాణం చేయాల్సి రావడం, అలాగే రీఫిల్ కోసం కనీసం ఒక నెల రోజుల పాటు వేచి చూడాల్సి రావడం వల్ల ప్రజల దైనందిన జీవితంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్య గ్రామ ప్రజలకు పెద్ద భారంగా మారింది.
ఈ నేపథ్యంలో ఉమ్మడి రేగళ్ల గ్రామ ప్రజల వినతిమేరకు, వారి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో సర్పంచ్ జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇండియన్ గ్యాస్ కనెక్షన్లను ప్రస్తుతం ఉన్న శ్రీ సమ్మక్క సారక్క గ్యాస్ ఏజెన్సీ నుండి మళ్లీ సత్యసీల్ గ్యాస్ ఏజెన్సీకి మార్చేందుకు సంబంధిత ఇండియన్ గ్యాస్ సేల్స్ మేనేజర్‌కు తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతున్నారు.

మనం
జనం కోసం అక్షర యజ్ఞం



# పాల్వంచ

పాల్వంచ సిటీ - పాల్వంచ మండలం

## కుటుంబ విలువలు, ఆరోగ్యం పట్ల అవగాహనను విద్యార్థులు పెంపొందించుకోవాలి

**– బాలోత్సవ్ వ్యవస్థాపకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు**



**పాల్వంచ, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఉత్తమ [illegible] రూపుదిద్దుకోవడానికి పాఠశాలతో పాటు కుటుంబ వాతావరణం కూడా చాలా అవసరమని డాక్టర్ రమేష్ బాబు అన్నారు. సోమవారం ఎంపీ ఎర్రగుంట పాఠశాల నందు కుటుంబ విలువలు, ఆరోగ్యమనే అంశంపై విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రమేష్ బాబు పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కారం నేర్చుకోవాలని తెలిపారు. జీవితంలో మన ఎదుగుదలకు తోడ్పడిన కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, బంధుమిత్రులను గుర్తుంచుకోవాలని తెలిపారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం పై అవగాహనను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. విద్యతో పాటు అన్ని రంగాలలో తన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని చెప్పారు. పాఠశాల వాతావరణం చాలా బాగుందని, కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉందని కితాబిచ్చారు. సాంకేతిక బోధనా పరికరాలు, అంకిత స్వభావం గల ఉపాధ్యాయులు ఉన్నారని ప్రశంసించారు. కొత్తగూడెంలో బాలోత్సవ్ నిర్వహించడం ద్వారా కొత్తగూడెం పేరుని దేశవ్యాప్తంగా ప్రచారం అయిందని, అందుకు ప్రతిభ కారణమన్నారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీయుటకు కొత్తగూడెం బాలోత్సవ్ ఒక వేదికగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరావు (డీవీ) మాట్లాడుతూ.. విద్యతో పాటు మానవ విలువలు, తల్లిదండ్రుల పెద్దలపట్ల గౌరవం, సమాజం పట్ల బాధ్యతను పెంపొందించే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీబాబు, పాఠశాల ఉపాధ్యాయులు లచ్చిరాం, శోభ, కామేష్, కవిత, వెంకన్నబాబు, నరేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## కొత్తగూడెం గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా వీడ్కోలు సంబరాలు



**పాల్వంచ, ఏప్రిల్ 13(మనం న్యూస్):** తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల కొత్తగూడెంలో డిగ్రీ తృతీయ సంవత్సరం పూర్తి చేసుకోనున్న తోటి విద్యార్థినులకు ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. కాలేజ్ ఆన్యువల్ డే సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపల్ రెంటాల వెంకటి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. పి పద్మ పాల్గొన్నారు. ప్రజా పాలన సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల లక్ష్యం గొప్పగా ఉండాలని, ఇష్టమైన రంగాలలో మంచి ఎంప్లాయ్ గా ఎదగాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు దానికి అనుగుణంగా కృషి చేయాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా. బోయిన ఝాన్సీ రాణి మాట్లాడుతూ.. గడిచిన రోజులు మళ్లీ రావని, ఈ డిగ్రీ కోర్సు జీవితంలో కీలకమన్నారు. ఏ ఉద్యోగం, లేదా ఇష్టమైన రంగాలలో స్థిరపడాలంటే డిగ్రీ తప్పనిసరి అన్నారు. డిగ్రీనే కాకుండా పీజీ లలో కూడా మంచి కోర్సులు ఉంటాయన్నారు. ఇంకా మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. తృతీయ సంవత్సర విద్యార్థినులు వారి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్

**పాల్వంచ, ఏప్రిల్ 13(మనం న్యూస్):** బోల్లారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. తనిఖీలలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థుల కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ.. కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి,





పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని, మాల్ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు.
ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చు

**– ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి : ఎస్పీ రోహిత్ రాజు**




**పాల్వంచ, ఏప్రిల్ 13(మనం న్యూస్):** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడం..ప్రజలలో ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించాలనే దృఢ సంకల్పంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎం సి బి టి ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన అవగహనా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్గొన్నారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అరైవ్ - అలైవ్ క్యాంపెయిన్ -2026 లో భాగంగా సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థినీ, విద్యార్థులు హాజరయ్యారు. కొత్తగూడెం నగరపాలక సంస్థ కమీషనర్ సుజాత, ఆర్టీఓ వెంకటరమణ, స్థానిక కార్పొరేటర్ నూకల సరిత, మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజనీర్ మొహమ్మద్ అలీ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, జీవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హెల్మెట్ వినియోగం, సీటు బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ నియమాల గురించి విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడం తప్పనిసరి అన్నారు. స్వీయ క్రమశిక్షణతో ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. రోడ్డుపై విధులలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నా, లేకపోయినా వాహనాలను నడిపేటప్పుడు నియమ, నిబంధనలను కచ్చితంగా పాటించాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలన్నారు. తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతకు బంగం వాటిల్లకుండా సహకరించాలని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రుల ఆశయాలకు తగ్గట్టుగా నడుచుకోవాలని సూచించారు. మంచిగా చదువుకుని క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి ఎదగాలని అకాక్షించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు.



## పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

**– రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు**

**– పాతపాల్వంచలో జెసిబితో కాలువ పూడికలు తీయించిన కార్పొరేటర్**



**పాల్వంచ, ఏప్రిల్ 13(మనం న్యూస్):** కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని లిరాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాతపాల్వంచ 46వ డివిజన్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం రోడ్ లో కార్పొరేటర్ కొత్వాల విమల దేవి పర్యవేక్షణలో జెసిబితో కాలువ పూడికలు తీయించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల మాట్లాడుతూ.. ప్రజలు తమ నివాసంలోని పరిసరాలను శుభ్రంగా ఉంచినప్పుడే ఎలాంటి అనారోగ్యాలు కలగవని అన్నారు.

# భట్టి విక్రమార్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారె





**దమ్మపేట, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** దమ్మపేట మండలంలో జరగనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ల శంకుస్థాపన కార్యక్రమాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,మండలఅధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.ఈ నెల 15వ తారీఖు బుధవారం తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థిక ప్రణాళిక విద్యుత్ శాఖల మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క ,దమ్మపేట మండలం, జగ్గారం,మల్లారం, గ్రామాలలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో స్థల పరిశీలనతో పాటు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# మనం కథనానికి స్పందన

## – శ్మశాన భూమికి హద్దులు, కబ్జాలపై కఠిన చర్యలు: తహశీల్దార్ హామీ





**సుజాతనగర్, ఏప్రిల్ 13 (మనం న్యూస్)** : సుజాతనగర్ మండలం వేపలగడ్డ 23వ డివిజన్ స్మశాన వాటిక ప్రభుత్వ భూమిపై జరుగుతున్న కబ్జా యత్నంపై "మనం తెలుగు దినపత్రిక"లో ప్రచురితమైన కథనానికి అధికారులు తక్షణమే స్పందించారు. తహసిల్దార్ ఆదేశాలతో రెవెన్యూ ఇంచార్జ్ వీరభద్రం, సర్వేయర్ వినోద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని భూమిని సమగ్రంగా పరిశీలించారు. గ్రామంలోని స్మశాన వాటికకు చెందిన ప్రభుత్వ భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేయగా, ఈ అంశాన్ని "మనం" వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సంఘటనా స్థలంలో సర్వే నిర్వహించిన అధికారులు భూమికి స్పష్టమైన హద్దులు గుర్తించి, అధికారికంగా సరిహద్దులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భూమి రికార్డులను పరిశీలించి, ప్రభుత్వానికి చెందిన భూమి అని నిర్ధారించారు. ఇకపై ఎవరైనా ఈ భూమిపై ఆక్రమణకు ప్రయత్నిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, ముఖ్యంగా స్మశాన వాటికల వంటి ప్రజాప్రయోజన భూములను కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా తీసుకుంటామని తహసిల్దార్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల తక్షణ చర్యలను స్థానికులు స్వాగతిస్తూ, సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ముందుకు వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో భూమిపై నిరంతర నిఘా కొనసాగించాలని, ఇలాంటి కబ్జా యత్నాలను పూర్తిగా అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుజాతనగర్ రైతు సంఘం మండల కార్యదర్శి బచ్చలకూర శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు నల్లగోపు పుల్లయ్య, కమిటీ సభ్యులు ఉడుగుల శ్రీకాంత్, గ్రామస్తులు జంగిలి వెంకన్న, చెన్నబోయిన రవి, కసనబోయిన నరసింహా, ఆవుల సాంబశివరావు, బొల్లు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మర మేధావుల సదస్సులో పాల్గొన్న న్యాయవాది మల్లెల ఉషారాణి





**చుంచుపల్లి, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** హైదరాబాద్ తాజ్ కృష్ణ హోటల్‌లో "మట్టిమనుషులు" నరసింహ ఆధ్వర్యంలో నిర్వహించిన కుమ్మర మేధావుల సదస్సు ఘనంగా జరిగింది. ఈ సదస్సులో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం మహిళా అధ్యక్షురాలు, న్యాయవాది మల్లెల ఉషారాణి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి పలువురు ప్రముఖులు, మేధావులు, అధికారులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా యూపీ ఉమెన్ కమిషన్ సభ్యురాలు అంజు దేవి, కర్నూలు రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, ఏపీ కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం శ్రీనివాస్ భాస్కర్, ఐలాపురం రాజా, కర్నూలు గ్రంథాలయ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, ఏపీ శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్, రిటైర్డ్ డిజిపి జె. పూర్ణచందర్రావు, సినీ కళాకారుడు వెంకట అప్పారావు, శాలివాహన వెల్ఫేర్ ట్రస్ట్ నరేష్, కాశీపతి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ జనసమితి రాష్ట్ర కార్యదర్శి కోదండరాం, మల్లెల రామనాథం, రాచకొండ వెంకన్న, ప్రొఫెసర్ పిడిశెట్టి శంకర్, టీవీ9 సత్య, ఈనాడు జర్నలిస్టులు, ఫార్మా కంపెనీ ఎండీ సంద్ర వెంకటయ్య, ఆకారం మల్లేష్, డిఆర్ఓ అశోక్, ఏఎస్పీ శ్రీనివాస్, ఇతర పోలీస్ అధికారులు, అడ్వకేట్లు, ప్రొఫెసర్లు, పారిశ్రామికవేత్తలు, సినీ కళాకారులు, విద్యావేత్తలు మరియు పలువురు మేధావులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

మనం



# అశ్వారావుపేట

అశ్వారావుపేట - దమ్మపేట - అన్నపురెడ్డిపల్లి - చంద్రుగొండ - ములకలపల్లి




## దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు

**దమ్మపేట, ఏప్రిల్ 13 (మనం న్యూస్ ) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల ప్రణాళిక ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా సోమవారం నుండి వారం రోజులు పాటు రోడ్డు భద్రత వారోత్సవములను కార్యక్రమంలో భాగంగా దమ్మపేట మండల పరిధిలోగల అన్ని గ్రామ పంచాయితీలలో విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో పోలీసు వారి పర్యవేక్షణలో అన్ని గ్రామపంచాయతీలలో రోడ్డుకి ఇరువైపులా గల చెట్ల పొదలను తొలగించి గుంతలను పోర్చడం జరుగుతుందని ప్రతి ఒక్కరు రోడ్డు ప్రమాణాలు పాటించాలని దమ్మపేట మండల ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, అదనపు ఎస్సై బాలస్వామి, పోలీస్ సిబ్బంది అలాగే వివిద గ్రామాల సర్పంచులు వార్డు మెంబర్లు విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





## మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి

### – మంత్రి తుమ్మల ను మర్యాదపూర్వకంగా కలిసిన:ఎమ్మెల్యే జారే,మున్సిపల్ కౌన్సిలర్లు

**దమ్మపేట, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** రాష్ట్ర వ్యవసాయ సహకార,మార్కెటింగ్ హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు,ని గండుగులపల్లిలోని వారి నివాసంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల అశ్వారా వుపేట నూతన మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందిన కౌన్సిలర్లను మంత్రివర్యులకు పరిచయం చేశారు. ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన కౌన్సిలర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు అలాగే అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీరు, రహదారులు,పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వివరిస్తూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# మనం



# భద్రాచలం

భద్రాచలం - దుమ్ముగూడెం



## డాక్టర్ అంబేద్కర్ కు బ్రాహ్మణోత్తముడి నివాళి

**భద్రాచలం,ఏప్రిల్ 13 (మనం న్యూస్)** : ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారత బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం చేయి విరిగి ఆయనకు అవమానంగా కనిపిస్తున్న సమయంలో, భద్రాచలం రామాలయంలో పూజారిగా పనిచేస్తున్న వనం నంద అనే బ్రాహ్మణోత్తముడు, డా. బి ఆర్ అంబేద్కర్ భావజాలాలు కలిగిన వ్యక్తి, స్వయంగా తానే చేతిని బాగు చేసి, నిలువెత్తు విగ్రహానికి రంగు వేసి అంబేద్కర్ పై ఉన్న ప్రేమ, గౌరవాన్ని చాటుకోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. భావజాలానికి కుల, మత, వర్గ, వర్ణ బేధాలు లేవని మరొకసారి చాటి చెప్పిన వనం నందా కి పలువురు అంబేద్కర్ వాదులు అభినందనలు తెలిపారు.




## కార్మిక పక్షపాతి కాపుల వెంకటేశ్వర్లు

**– సీపీఎం ఆధ్వర్యంలో కాపుల వెంకటేశ్వర్లు 12వ వర్ధంతి సభ**

**భద్రాచలం,ఏప్రిల్ 13 (మనం న్యూస్):** కార్మిక వర్గ హక్కుల పరిరక్షణకోసం జీవితాంతం కృషి చేసిన నాయకుడు కాపుల వెంకటేశ్వర్లు అని ప్రజా సమస్యలపై ప్రజలను కదిలించి నిరంతరం పోరాటాలు నిర్వహించడమే మనం ఆయనకు ఇచ్చే నివ్వాలని, సీపీఐఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు లు అన్నారు. కాపుల వెంకటేశ్వరరావు 12వ వర్ధంతి సభ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ముందుగా కాపులు వెంకటేశ్వరరావు చిత్రపటానికి బండారు శరత్ బాబు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, కార్మికుల పక్షాన నిలబడి పోరాటం చేసిన వ్యక్తి కాపులు వెంకటేశ్వర్లని ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై వెంకటేశ్వర్లు నిరంతరం శ్రమించారని కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, కార్మిక సంక్షేమ పథకాల అమలులో ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్మికుల ఐక్యతే వారి బలం అని నమ్ముతూ, ఎల్లప్పుడు ప్రజా పోరాటాలకు ఆయన ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో కార్మికుల హక్కులు క్షీణిస్తున్నాయని, వాటిని కాపాడేందుకు మరింత ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు కార్మిక వర్గ సమస్యలను పరిగణించి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వర్లు చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో 20వ వార్డ్ నెంబర్ ఇర్ప అనసూయ, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్, పట్టణ కమిటీ సభ్యులు ఎన్ నాగరాజు, శ్రీనివాస్, ఎస్ అజయ్ కుమార్, కుంజ శ్రీను, భూపేంద్ర, యు జ్యోతి, జీవనజ్యోతి, సిఐటి నాయకులు కొలగాని రమేష్, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి దారిశెట్టి సతీష్ బాబు, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి కొప్పుల రవీంద్ర, కాపుల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలంలో గర్జించిన ఐక్యతా గళం..

**– 5 గ్రామాలను తిరిగి తెలంగాణలో విలీనం చేసేలా పోరాటం చేస్తా**
**– రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి**






**భద్రాచలం ,ఏప్రిల్ 13( మనం న్యూస్):**
భద్రాచలం పట్టణంలో సోమవారం నాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో "భద్రాద్రి పునరేకీకరణ" లక్ష్యంగా భారీ అఖిల పక్ష సమావేశశీ ఘనంగా నిర్వహించారు. భద్రాచలం బ్రిడ్జి సెంటర్ వద్దగల ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో జరిగింది.గతంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన 5 గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో, ముఖ్యంగా భద్రాద్రి జిల్లాలో చేర్చాలనే పట్టుదలతో ఈ వేదిక ద్వారా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కీలక సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర మాజీ మంత్రి, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి ముఖ్యఅతిథిగా హాజర అయ్యారు. ఈ సందర్భంగా రేణుకా చౌదరి మాట్లాడుతూ నాకు పదవులు . ముఖ్యం కాదని, నేను ఈ జిల్లా ఆడబిడ్డనని. అదే నాకు శాశ్వత పదవి అని అన్నారు.నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలిపేందుకు మీరందరూ తరపున పోరాటం చేస్తానని తెలిపారు.కార్మిక ఉద్యోగ సంఘాలు తలపెట్టిన ఈ బృహత్తర కార్యక్రమం ఎంతో ప్రతిష్టాత్మకమైనదని అన్నారు.2013 లోనే పార్లమెంట్ సమావేశాల్లోనే భద్రాచలం సమస్య గురించి ప్రస్తావించినట్లు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఒకటే విన్నపం.ఈ 5 గ్రామ పంచాయతీ లను తెలంగాణ లో కలపడానికి ముందుగా తొలి అడుగు మీరే వెయ్యాలనీ కోరారు.అయోధ్యలో అంత పెద్ద రాముని గుడి కట్టిన ఘనత ప్రధాని మోదీ దేనిని, భద్రాచలం లో ఉన్న పురాతన చారిత్రాత్మక రాముని గుడి అభివృద్ధికి కూడా కృషి చేయాలని కోరారు. ఉత్తర భారతదేశం నుండి రామయ్య కల్యాణానికి పెద్ద ఎత్తున రైళ్లలో అక్కడ వారిని ఇక్కడకి తీసుకుని వచ్చేలా మనమందరం ప్రయత్నం చేయాలని కోరారు. అలాగే ప్రధాని మోదీ కూడా శ్రీ రామ కళ్యాణంలో పాల్గొనేందుకు భద్రాచలం రావాలని ఇక్కడ నుండి ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు.భద్రాచలం పట్టణ అభివృద్ధికి ఆటంకంగా మారి, విలీనమైన ఐదు గ్రామపంచాయతీల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు డిమాండ్ చేశారు.ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని వివిధ ఉద్యోగ సంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా మరియు ఉపాధ్యాయ సంఘాల నేతలు ఈ సభలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు.రాజకీయాలకు అతీతంగా, భద్రాచలం భవిష్యత్తు కోసం సాగుతున్న ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి, ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ,ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ,తెలంగాణ ఉద్యోగ జె ఏ సి ఐక్యవేదిక నాయకులు ఏలూరి శ్రీనివాసరావు ,తెలంగాణ ఉద్యమ సీనియర్ నాయకులు తిప్పన సిద్ధులు చల్లగుల్ల నాగేశ్వరరావు, బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ రాకేష్ రెడ్డి, వివిధ శాఖ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు .

## ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

**– కలెక్టర్కు ఫిర్యాదు చేసిన సోంది మల్లు దొర**

**దుమ్ముగూడెం ఏప్రిల్ 13: (మనం న్యూస్ ):** ఏజెన్సీ ప్రాంతంలో ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏవీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సోందె మల్లుదొర సోమవారం ప్రజా దర్బారులో జిల్లా కలెక్టర్ అంకిత్ ని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మల్లు దొర మాట్లాడుతూ ఆదివాసి చట్టాలకు తూట్లు పొడుస్తున్న చర్ల దుమ్ముగూడెం మండలాలకు చెందిన కొందరు రెవెన్యూ అధికారుల పై చర్యలు తీసుకోవాలని అన్నారు. దుమ్ముగూడెం చర్ల మండలాలు పూర్తిగా ఆదివాసి లతో నిండి ఉన్న మండలాలని ఈ ప్రాంతంలో ఆదివాసి చట్టాలు బలంగా ఉన్నప్పటికీ అధికారులు మాత్రం ఏజెన్సీ చట్టాలను పక్కన పెట్టి అక్రమార్కులకు కొమ్ము కాస్తూ ఏజెన్సీ చట్టాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపించారు . ఈ రెండు మండలంలో విచ్చలవిడిగా ఏజెన్సీ భూములు వ్యవసాయ భూములు ప్రభుత్వ భూములను,స్థలాలు కొందరు గిరిజనేతరులు కబ్జాలు చేస్తూ క్రయవిక్రయాలు విచ్చలవిడిగా కొనసాగిస్తుంటే రెవిన్యూ అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొనుగోలు అమ్మకాలు చేసిన ఏజెన్సీ భూములు పై చర్యలు తీసుకోకుండా కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడి ఏజెన్సీ భూములను గిరిజనేతర్ల నుండి గిరిజనేతర్ల పేరు మీద ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా రెవెన్యూ భూములను బదిలీలు చేసి మ్యూటేషన్ లు చెసే పరిస్థితి నెలకొంది అని అన్నారు. రెవెన్యూ అధికారుల చొరవతో అట్టి ఏజెన్సీ మండలాలలో ప్లాట్లు షాపింగ్ మాల్ అక్రమ భవనాలు ఫంక్షన్ హాల్ వెలుస్తున్నాయని వాటి పై ఆదివాసి నాయకులు పదేపదే ఫిర్యాదు చేసినా ఎల్ టి ఆర్ కేసులు పెట్టి చర్యలు తీసుకోమని ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఇప్పటికీ ఒక్క ఎస్టీఆర్ కేసు నమోదు చేయలేదంటే మండలాలలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యానికి ఇంతకన్నా ఉదాహరణ ఏం కావాలని అన్నారు. భద్రాచలం పట్టణం మాదిరిగా ఆదివాసులకు స్థానం లేని విధంగా ఏజెన్సీ ప్రాంతాన్ని అంతం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆదివాసులకు ఎస్టి కుల ధ్రువీకరణ ఇవ్వాలంటే అధికారులు బేరాలు ఆడే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ చట్టాలను కాలరాసే అధికారుల పై చర్యలు తీసుకోవాలని ఆదివాసి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు కార్యక్రమంలో నాయకులు సాయిరాం సతీష్ భద్రం తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాలను నివారించడం అందరి బాధ్యత

### – ఆర్ కొత్తగూడెం సర్పంచ్ తుర్రం రవికుమార్



**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆర్ కొత్తగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ తుర్రం రవికుమార్ అన్నారు. రోడ్డు భద్రతపై గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోటారు వాహన చట్టంలో పొందుపరిచిన నియమ నిబంధనలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలగి ఉండాలని కోరారు. తోటి ప్రయానికుడిని గౌరవిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడాలని విజ్ఞప్తి చేసారు. రహదారి పై ప్రయాణించే సమయంలో తమతో పాటు ఎదుటివారి ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. రహదారి వెంట ఉన్న బావులను పూడ్చటం, మూసివేయడం, చెట్ల పొదలను తొలగించడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కాపుల కృష్ణార్జున్ రావు, కార్యదర్శి శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ ముత్తమ్మ, వార్డు సభ్యులు కారం సుధాకర్, కొమరం భద్రయ్య, కంగాల అభిరామ్, చింతకాయల స్వరూప, అంగన్ వాడీ టీచర్స్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు జోగిరాజు, మురారి, పవన్ పాల్గొన్నారు.

# దాతృత్వం చాటుకున్న వ్యాపారి

### – మృతదేహం భద్రపరిచే ఫ్రీజర్, వీల్ చైర్ వితరణ





**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తన సతీమణి మృతిచెందిన సందర్భంలో భద్రపరిచే ఫ్రీజర్ లేక ఇబ్బందులు పడ్డ విషయం గమనంలోకి తీసుకొని ఇతరులకు ఇటువంటి ఇబ్బందులు తలెత్తవద్దనే తలంపుతో చర్లకు చెందిన శీతలపానీయ డీలర్ చింతలపూడి రామకృష్ణ దాతృత్వం ప్రదర్శించారు. సతీమణి సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం సొంతంగా రూ. 80 వేల విలువచేసే మృతదేహం భద్రపరిచే ఫ్రీజర్ ను గ్రామ పంచాయతీకి అందచేసారు. ఇప్పటికే చర్లలో ఉన్న రెండు ఫ్రీజర్లు మరమ్మత్తులకు గురవడంతో మూలనపడ్డాయి. దీంతో ఇక్కడి వారు అవస్థలు పడుతున్నారు. వీరి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నూతన ఫ్రీజన్ ను అందచేసి దాతృత్వం ప్రదర్శించారు. మరోవైపు సామాజిక ఆరోగ్య కేంద్రం కు వచ్చే రోగులు, వృద్దుల సౌకర్యార్థం రూ. 10 వేల విలువ చేసే వీల్ చైర్ ను ఆసుపత్రి సూపరిం టెండెంట్ డాక్టర్ సాయివర్దన్, ఫ్యామిలీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ రాంప్రసాద్ సమక్షంలో వైద్యశాలకు అందచేసారు. వ్యాపారి రామకృష్ణ ఔదార్యం పట్లు స్దానికులు హర్షం వ్యక్తం చేసారు. కార్యక్రమంలో చింతలపూడి హరిబాబు, బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, గోరంట్ల వెంకటేశ్వరరావు, పంజా రాజు, తడికల బుల్లబ్బాయి,చెన్నుమల్ల వంశీ పాల్గొన్నారు.

# హమ్మయ్య.. పరీక్షలు ముగిసాయి...

### – సుదీర్ఘంగా సాగిన పది పరీక్షలు
### – ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** నెలరోజుల పాటు జరిగిన మారదాన్ పదవ తరగతి పరీక్షలు సోమవారంతో ముగియడంతో విద్యార్థులు హమ్మయ్య పరీక్షలు ముగిసాయి అంటూ ఊపిరిపీల్చుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ చరిత్రలో గతంలో ఎన్నడూ ఇన్నాల్లపాటు పరీక్షలు జరిగిన దాఖలాలు లేవు. మార్చి 14 వ తేదీన ప్రారంభమై ఏప్రిల్ 13 తో ముగిసాయి. కేవలం 7 పేపర్లను సంబంధించిన పరీక్షలు నెలరోజుల పాటు సాగడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయమై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. కాగా చర్ల మండలంలో చర్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యనారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది పరీక్షలను నిర్వహించారు. రెండు సెంటర్లలో జరిగిన పరీక్షలకు మండలంలోని 11 ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలకు చెందిన 312 మంది విద్యార్దులకు గాను 311 మంది హాజరుకాగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల కేంద్రం నుండి ఒక విద్యార్ది గైర్హాజరయ్యాడు. పది పరీక్షలు ప్రశాంతంగా ముగియడం పట్ల మండల విద్యాశాఖ అదికారి పరిటాల వెంకటరమణ హర్షం వ్యక్తం చేసారు. పరీక్షలు సజావుగా సాగేందుకు సహకరించిన ఇన్విజిలేటర్లు, సిబ్బంది, పోలీస్, పంచాయతీ, వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.



మనం

చర్ల
చర్ల మేజర్ పంచాయతీ - చర్ల మండలం

# పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోండి

### – చిరు దాన్యాలతో తయారుచేసిన వంటకాల ప్రదర్శన
### – పోషన్ పహాడ్ కార్యక్రమంలో సిడిపివో చైతన్య



**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** గర్బిణి స్త్రీలు, బాలింతలు, చిన్నారులు పోషక సమతుల్యత కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సిడిపివో చైతన్య అన్నారు. పోషన్ పహాడ్ కార్యక్రమంలో బాగంగా సోమవారం చర్ల ప్రాజెక్ట్ పరిదిలోని చర్ల, సుబ్బంపేట, ఆంజనేయపురం సెక్టార్ల ఆద్వర్యంలో స్దానికంగా దొరికే ఆహార పదార్దాలు, చిరు దాన్యాలతో తయారు చేసిన ఆరోగ్యకరమైన వంటల ప్రదర్శన, వంటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో మాట్లాడుతూ పోషక విలువలున్న చిరుదాన్యాలతో వంటల తయారీ విదానాన్ని గర్బిణి, బాలింతలకు వివరించారు. ప్రతి వంటకంలో పోషక విలువలు, సమతుల ఆహారం ప్రాదాన్యతను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఆదిలక్ష్మి, బందా స్వరూపరాణి, పోషన్ అభియాన్ బ్లాక్ కో ఆర్డినేటర్ పి నాగరాజు, అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

# గరియాబంద్ జిల్లాలో మావోయిస్టు డంప్ స్వాధీనం



**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఛత్తీస్‌ఘడ్ – ఒడిషా సరిహద్దులోని గరియాబంద్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టు డంప్ ను స్వాదీన పరుచుకున్నారు. సోనాబేడ అభయారణ్యంలోని దేకున్ పాని అడవులలో సిఆర్పిఎఫ్ బలగాలు మావోయిస్టుల కొరకు కూంబింగ్ నిర్వహిస్తుండగా భారీ సంఖ్యలో డంప్ నుండి పేలుడు పదార్థాలను స్వాదీనపరుచుకున్నారు. ఒడిషా రాష్ట్రంలోని కోమ్నా పోలీస్ బేస్ క్యాంప్ కు చెందిన సిఆర్పిఎఫ్ బృందం అడవులలో గాలింపు నిర్వహిస్తుండగా అనుమానాస్పద వస్తువులను గుర్తించారు. అందులో భారీ సంఖ్యలో పేలుడు పదార్థాలు ఉన్నట్లు కనుగొన్నారు. స్వాదీనం చేసుకున్న వాటిలో 70 జిలిటెన్ స్టిక్స్, 3 స్టీల్ కంటైనర్లు, 4 బండిల్ల ఎలక్ట్రిక్ వైర్లు ఉన్నాయి. భద్రతా బలగాల అంచనా ప్రకారం మావోయిస్టులు వీటిని ఉపయోగించి భారీ దాడికి పాల్పడేందుకు కుట్రపన్నినట్లు సాగిస్తున్నారు.


# కాంకేర్ జిల్లాలో ఎన్ కౌంటర్

### – మహిళా మావోయిస్టు మృతి – తప్పించుకున్న మరో 10 మంది



**చర్ల, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో సోమవారం భద్రతా బలగాలు – మావోయిస్టల మద్య జరిగిన ఎదురుకాల్పులలో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది. మచ్ పల్లి అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం అందుకున్న భద్రతా బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడటంతో కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పులలో తెలంగాణ కు చెందిన పార్దాపూర్ ఏరియా కమిటీ సభ్యురాలు, రూ. 5 లక్షల రివార్డు కలిగిన రంగబోయిన బాగ్య అలియాస్ రూపి రెడ్డి మృతి చెందగా మరో 10 మంది మావోయిస్టులు తప్పించుకున్నారు. వారి కొరకు భద్రతా బలగాలు కూంబింగ్ కొనసాగిస్తున్నాయి. కాల్పుల అనంతరం సంఘటనా ప్రాంతం నుండి మావోయిస్టు మృతదేహంతో పాటు పిస్టల్, పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యంను స్వాదీన పరుచుకున్నారు. రూపిరెడ్డి సిద్దిపేట జిల్లా మిర్ దొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన చెందిన వారు. గత ఏడాది మన్ పూర్ – మెహ్లా అడవులలో జరిగిన ఎదురుకాల్పులలో మృతిచెందిన దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు విజయ్ రెడ్డి సతీమణి కావడం గమనార్హం. విజయ్ రెడ్డి ఎన్ కౌంటర్ అనంతరం రూపి లొంగిపోవాలని పోలీసులు పలుమార్లు విజ్ఞప్తి చేసారు. ఈ క్రమంలో సోమవారం ఆమె ఎన్ కౌంటర్ లో మృతిచెందడం గమనార్హం. ఈ విషయమై బస్తర్ ఐజి సుందర్ రాజ్ మాట్లాడుతూ దండకారణ్యంలో కొద్దిసంఖ్యలో మావోయిస్టులు ఉన్నారని, వారు కూడా పుణరావాస విదానం ప్రకారం లొంగిపోవడం ద్వారా శాంతియుత జీవితం గడపాలని విజ్ఞప్తి చేసారు.

మనం



# ఇల్లందు

ఇల్లందు మున్సిపాలిటీ - ఇల్లందు మండలం - టేకులపల్లి - కామేపల్లి



## 24వ వార్డులో సీమంతం/ అక్షరాభ్యాసం కార్యక్రమాలు,

### – ముఖ్యఅతిథిగా హాజరైన ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్,

**ఇల్లందు, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఇల్లందు మున్సిపాలిటీ 24.వార్డు కౌన్సిలర్ చెనిగరపు శృతి, ఆధ్వర్యంలో, సోమవారం ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో అంగన్వాడి కేంద్రంలో ఘనంగా సీమంత ఓ అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు, ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో ఉన్న అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు సీమంత కార్యక్రమం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్, దొడ్డ కిరణ్ మిత్రబి డానియల్, హాజరై, గర్భిణీ స్త్రీలకు ఆశీర్వాదాలు అందించారు. అదేవిధంగా, ఇల్లందు సిడిపిఓ అరుణ కుమార్, కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో భాగమయ్యారు.ఈ కార్యక్రమంలో 24వ వార్డు కౌన్సిలర్ చెనిగరపు శృతి రమేష్, పాల్గొని తన వంతు సహకారం అందించారు. అంగన్వాడి టీచర్స్ చైర్ పర్సన్ వార్డు కౌన్సిలర్ ని ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ధనలక్ష్మి, సక్కుబాయి, అంగన్వాడి టీచర్లు నాగలక్ష్మి, దేవమణి, లక్ష్మీకాంత్, ఆయాలు సుప్రియ, కరుణ కుమారి, కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా వార్డులోని మహిళలు, చిన్నారులు పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమం ద్వారా గర్భిణీల ఆరోగ్యం, శిశు సంక్షేమం విద్య ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించబడింది.

## రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించిన విజయలక్ష్మి నగర్ సర్పంచ్

### – విజయలక్ష్మి నగర్‌లో సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత గ్రామసభ

**ఇల్లందు, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఇల్లందు విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చందవత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం 99 రోజుల ప్రణాళికలో భాగంగా సోమవారం రోడ్డు భద్రత గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ పరిధిలోని యువతీ యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు .ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ బాబు మాట్లాడుతూ రోడ్డుపై వెళ్లేటప్పుడు కనీస జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ నిబంధనలో కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని గ్రామపంచాయతీలో పరిధిలో ఎక్కడైనా ఏదైనా యాక్సిడెంట్ ద్వారా ప్రమాదం జరిగితే ముందుగా సెంటర్లను ఆరోగ్యశాఖ వారిని సంప్రదించాలని అనంతరం పోలీస్ డిపార్ట్మెంట్ వారికిసమాచారంఅందించాలని సూచించారు... . ఈకార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ రజనీకాంత్, వార్డ్ సభ్యులు హరి సింగ్, రెంటాల సదా,గుగులోత్ మల్లికా, సౌజన్య,ధారావత్ వసంత,అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.....



## ఘనంగా ఇల్లందు మున్సిపాలిటి కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక

**కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన శాసన సభ్యులు కోరం కనకయ్య....**
**కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల ఏకగ్రీవ అమోదంతో నలుగురు కో ఆప్షన్ సభ్యుల ఏన్నిక...**
**నలుగురు సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించిన కమిషనర్,....**



**ఇల్లందు, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** ఇల్లందు మున్సిపల్ కౌన్సిలర్ సమావేశ కార్యాలయంలో సోమవారం ఇల్లందు పురపాలక సంఘం కో ఆప్షన్ సభ్యుల ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు ఈ కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గం ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ల అమోదం చేత ఏకగ్రీవంగాఎన్నికైనమడ ంగుసాంబమూర్తి,పర్రె స్వర్ణలత,సైయద్ ఆజాం,ఎస్కె హసీనా, లతో ఇల్లందు మున్సిపల్ కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వయంగా ప్రమాణ స్వీకారం చేసిన నలుగురు అభ్యర్థులకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు,ఈ సమావేశంలో ఇల్లందు పురపాలకం చైర్మెన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్,వైస్ చైర్మెన్ పెండేల రాజు...కౌన్సలర్స్ ఎస్.కె సైద్ మీయా,అజ్మీర వంశీ, ఎండి కుష్బు,చిల్లావిజయ భారతి, రాధాకమల్ కోరి గోపగాని రాజు,రేఖ స్వరూప,గందె పద్మ మెరుగు కార్తీక్, మొగిలి లక్ష్మి,రంపా రమ్య దండు సారయ్య,నీరుడు ఉపేంద్ర,సోనీ భాయ్ కోరి,ఉల్లింగ విజయలక్ష్మి,పింగళి అనూహ్య, ఎండి జాఫర్, నీలపు రమేష్,కొర్లపాటి కిరణ్,చెనిగరపు శృతి,పురపాలక సిబ్బంది పాల్గొన్నారు..?



## గ్రామపంచాయతీలలో ఎరైవ్ ఎలైవ్ గ్రామసభలు

### – రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు – పలుచోట్ల ప్రతిజ్ఞలు చేసిన అధికారులు ప్రజలు లక్ష్మీనగరం గ్రామ సభలో పాల్గొన్న భద్రాచలం రవాణా శాఖ అధికారి , దుమ్ముగూడెం సిఐలు





**దుమ్ముగూడెం ఏప్రిల్ 13 (మనం న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రణాళిక ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం మండలంలో సోమవారం 37 గ్రామపంచాయతీలలో రోడ్డు భద్రతపై " ఎరైవ్ ఎలైవ్ " గ్రామ సభలు నిర్వహించారు. గ్రామపంచాయతీల సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలలో ప్రతి వ్యక్తి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన నివారణ చర్యలను జాగ్రత్తగా ఈ సందర్భంగా చర్చించారు. అనేక పనుల మీద బయటకు మన కుటుంబీకులు క్షేమంగా ఇంటికి తిరిగి రావాలని అలాంటి పరిస్థితిని తీసుకురావడం కోసం ప్రతి వ్యక్తి తమ ప్రయాణాలలో రోడ్డు భద్రత నిబంధన నియమాలను పాటించాలని గ్రామ సభలలో పాల్గొన్న పలువురు అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామపంచాయతీలో సర్పంచ్ అధ్యక్షుడిగా పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, యువత తో మొత్తం 9 మంది సభ్యులతో రోడ్డు భద్రత కమిటీలను వేశారు. ఈ సందం ర్భంగా పలు గ్రామపంచాయతీ గ్రామ సభలలో రోడ్డు భద్రతపై తమ వంతు కర్తవ్యాన్ని నెరవేరుస్తామని ప్రతిజ్ఞలు చేశారు.

**లక్ష్మీనగరం గ్రామసభలో పాల్గొన్న భద్రాచలం రవాణా శాఖ అధికారి దుమ్ముగూడెం సిఐలు**


రోడ్డు భద్రతపై మండల కేంద్రం లక్ష్మీనగరం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ సరియం. రాజమ్మ అధ్యక్షతన లక్ష్మీనగరంలో నిర్వహించిన గ్రామసభలో భద్రాచలం రోడ్డు రవాణా శాఖ అధికారి రాజశేఖర్ రెడ్డి, దుమ్ముగూడెం సీఐ వెంకటప్పయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రజలకు రోడ్డు భద్రతపై తీసుకోవలసిన సూచనలు జాగ్రత్తలను వివరించారు. ప్రతి వ్యక్తికి వ్యక్తిగత భద్రత అవసరమని రోడ్డు భద్రతా నియమాలను తూచా తప్పకుండా పాటిస్తే చాలావరకు ప్రమాదాలను నివారించవచ్చునని వారు ఈ సందర్భంగా తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. అనంతరం గ్రామ సభలో పాల్గొన్న ప్రజలందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి రోహిణి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పిలక వెంకటరమణారెడ్డి, వార్డు సభ్యులు గ్రామపంచాయతీ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల వారోత్సవాలు




**భద్రాచలం, ఏప్రిల్ 13 (మనం న్యూస్ ):**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం నాడు ఆర్టీసీ భద్రాచలం డిపో వారి ఆధ్వర్యంలోఎరైవ్ ఎ లైవ్ కార్యక్రమం జరిగినది . ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం రోడ్డు ప్రమాదాల కు గురికాకుండా ఉండాలని,మద్యం మత్తులో ,అతివేగంగా వాహనాలు నడపకూడదని సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపద్దని స్లొగన్స్ ఇస్తూ, భద్రాచలం డిపోలోని ఆర్టీసీ ఉద్యోగులందరూ బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య ,పోలీస్ సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ తిరుపతి, భద్రాచలం డిపో మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాస్ ,హెడ్ కానిస్టేబుల్ రాజు,భద్రాచలం డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమ ఉద్దేశం ఎవ్వరు కూడా రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా అందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని, మద్యం మత్తులో ,సెల్ఫోన్లు మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని ,ఏ వాహనదారులైన తగు జాగ్రత్తతో వాహనాన్ని నడిపినట్లు అయితే ఎటువంటి ప్రమాదాలు జరగవని ఆయన తెలిపారు.

మనం



# పినపాక

పినపాక - కరకగూడెం - ఆళ్లపల్లి - గుండాల- బూర్గంపాడు

## ఐటీసీ వేతన ఒప్పంద జాప్యంపై జేసీఎల్ కు ఫిర్యాదు

**-- గుర్తింపు సంఘం వైఫల్యం.. యాజమాన్యం నిర్లక్ష్యంపై ఐఎన్‌టీయూసీ ఆగ్రహం**

**-- పారిశ్రామిక శాంతికి విఘాతం కలగకముందే జోక్యం చేసుకోండి**



**బూర్గంపహాడ్ ఏప్రిల్ 13 (మనం న్యూస్):** సారపాక ఐటీసీ పీఎస్‌పీడీ కర్మాగారంలో 14వ వేతన ఒప్పందం విషయంలో జరుగుతున్న జాప్యంపై ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాలు గళమెత్తాయి. ఈ మేరకు సోమవారం వరంగల్‌లోని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయంలో సూపర్డెంట్ గౌతమికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి పరిశ్రమలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న గుర్తింపు సంఘం ఎన్నికల సమయంలో కార్మికులకు ఆకాశమే హద్దుగా హామీలు ఇచ్చిందని మండిపడ్డారు. ముఖ్యంగా ప్రతి కార్మికునికి నెలకు రూ. 22,000/- వేతన పెంపు, 100% అన్‌లిమిటెడ్ మెడికల్ సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 12 లక్షలు, 50 ఏళ్ల వేడుకల సందర్భంగా 10 గ్రాముల బంగారు నాణేం, వీడీఏ పాయింట్‌కు రూ. 6/- పెంపు వంటి హామీలతో ఓట్లు వేయించుకున్నారని గుర్తుచేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఒప్పందం పూర్తి చేయకపోవడం గుర్తింపు సంఘం వైఫల్యమేనని ధ్వజమెత్తారు. పరిశ్రమ స్థాపించిన కొత్తలో 70 వేల టన్నులుగా ఉన్న ఉత్పత్తి ఇప్పుడు 8 లక్షల టన్నులకు పెరిగినా, కార్మికుల జీవన ప్రమాణాలు ఏమాత్రం మెరుగుపడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం నష్టాల పేరుతో కుంటిసాకులు చెబుతూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తోందని, దీనికి గుర్తింపు సంఘం వత్తాసు పలుకుతోందని ఆరోపించారు.

### సమ్మె దిశగా కాంట్రాక్ట్ కార్మికులు:

జాబ్ నోటిఫికేషన్ల పేరుతో బదిలీ మరియు కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం మోసం చేస్తోందని, ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులు సమ్మె నోటీసులు ఇచ్చి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఏ క్షణమైనా పరిశ్రమలో సమ్మె మొదలయ్యే అవకాశం ఉందని, తక్షణమే లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని ఉత్పత్తికి, పారిశ్రామిక శాంతికి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మిత్రపక్షాల నాయకులు వినోద్, సలీం, పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సాయిరాం, కూచిపూడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి...

**ఎస్సై ఎం.సోమేశ్వర్...**



**ఆళ్లపల్లి, ఏప్రిల్ 12 (మనం న్యూస్):** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆళ్లపలి ఎస్సై ఎం. సోమేశ్వర్ అన్నారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ రహదారిపై వాహనం నడిపే ముందు భద్రతకు సంబంధించిన అన్ని విషయాలపై శ్రద్ధ వహించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, పెద్ద వాహనాలు నడిపేవారు సీటు బెల్టు ధరించలని, మూలం మలుపుల వద్ద జాగ్రత్తగా నడపాలన్నారు. మత్తుపదార్థాలు సేవించి, సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనం నడపొద్దు అన్నారు. అతివేగంగా వాహనాలు నడపడం వల్ల మీతో పాటు రోడ్డుపై ప్రయాణిస్తున్న ఇతరులకు కూడా ప్రమాదం వాటిల్లుతుందని తెలియజేశారు. రహదారిపై వాహనాలు నడిపే ముందు తమ కుటుంబాలను గుర్తు చేసుకోవాలని ఏదైనా జరగడానికి జరిగితే వారు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొమరం శాంతారావు, ఆళ్లపల్లి కార్యదర్శి శిరీష, గ్రామస్తులు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం 'కొనుగోలు'లో జాప్యం.. అన్నదాతల కంట కన్నీరు!

**-- వరి కోతలు ముమ్మరం.. కేంద్రాల జాడ ఏది?**

**-- కళ్లాల్లోనే వేలాది క్వింటాళ్ల ధాన్యం.. వాన వస్తే పరిస్థితి ఏమిటి?**

**-- మిల్లర్లను ఆశ్రయిస్తున్న రైతులు.. 'తక్కువ ధర'కు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి!**



**బూర్గంపాడు, ఏప్రిల్ 13 (మనం న్యూస్):** మండలంలోని అన్నదాతలకు కష్టాలు తీరడం లేదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారుతోంది. వరి కోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా, మండలంలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంపై రైతాంగం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. బూర్గంపాడు మండలంలో మొత్తం 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందులో.. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలు, జీసీసీ ఆధ్వర్యంలో ఒక కేంద్రం, డీఆర్డీఏ ఆధ్వర్యంలో రెండు కేంద్రాలు ఉండాలని నిర్ణయించినప్పటికీ, ఇప్పటి వరకు ఒక్క కేంద్రం కూడా అందుబాటులోకి రాలేదు. అధికారుల ఉదాసీనత వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**కళ్లాల్లోనే కుప్పలు:**

మండల వ్యాప్తంగా వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని రైతులు కళ్లాల్లోనే కుప్పలుగా పోసి కొనుగోలు కేంద్రాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఆకాశం మేఘావృతమైన ప్రతిసారీ అన్నదాతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అకాల వర్షం వస్తే ధాన్యం తడిసిపోయి, రంగు మారి భారీ నష్టం వాటిల్లుతుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అదను చూసి మిల్లర్ల 'దోపిడీ':**

ప్రభుత్వ కేంద్రాలు తెరవకపోవడంతో రైతుల అవసరాన్ని అదునుగా తీసుకుని ప్రైవేటు మిల్లర్లు, దళారులు రంగంలోకి దిగుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కామన్ రకం ధాన్యం మద్దతు ధర రూ. 2,369 ఉండగా, కొనుగోలు కేంద్రాలు లేకపోవడాన్ని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. మద్దతు ధర కంటే చాలా తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారు. అప్పులు తీర్చాల్సిన ఒత్తిడిలో ఉన్న రైతులు చేసేదేమీ లేక, వచ్చిన కాడికి అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు.

**జాప్యం ఎందుకు?**

సాధారణంగా కోతలు ప్రారంభం కాకముందే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు స్పష్టత ఇవ్వాలి. కానీ, బూర్గంపాడు మండలంలో గతేడాది కంటే కోతలు వేగంగా సాగుతున్నా, ప్యాడీ క్లీనర్లు, తేమ కొలిచే యంత్రాలు, గైడ్ లైన్లు సిద్ధం చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు తక్షణమే స్పందించి, మండలంలోని ప్రధాన కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో తామంతా రోడ్లెక్కి నిరసన తెలపాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**-ప్రజలు, వాహనదారులు నిబంధనలు పాటించాలి**

**-ఎస్సై మేడా ప్రసాద్**



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 13(మనం న్యూస్):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు, వాహనదారులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని..రోడ్డు భద్రత ప్రతిఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని బూర్గంపహాడ్ ఎస్సై మేడా ప్రసాద్ అన్నారు. సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా 'అరైవ్-అలైవ్' కార్యక్రమం చేపట్టి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఎస్సై మాట్లాడుతూ అరైవ్ అంటే ఇంటి నుంచి బయటకు ఎలా వెళ్లామో... అలైవ్ అంటే అంతే సురక్షితంగా ఇంటికి రావడం అని తెలిపారు. సోమవారం నుంచి 18వ తేదీవరకు మండలవ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రజలకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తూ ఆ ప్రమాదాల నివారణకు కృషిచేస్తున్నామన్నారు. ప్రమాదాలకు నిలయమైన ప్రదేశాల్లో గుంతలు ఉంటే తాత్కాలికంగా పూడ్చించాలని, మూలమలుపుల వద్ద పెరిగే పిచ్చి చెట్లు, ముళ్లపొదలు తొలగించాలని పంచాయతీ సర్పంచ్ మందా నాగరాజుకు సూచించారు. అన్ని పంచాయతీల్లో సర్పంచ్లు ఈ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతను అందరి బాధ్యత తీసుకుని ప్రమాదాల నివారణకు కృషిచేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమం సారపాక పంచాయతీ కార్యాలయంలో కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ గుండె వెంకన్న, డీటీ సమ్మయ్య, అదనపు ఎస్సై దేవ్సంగ్, న్యాయవాది భజన సతీష్, స్థానిక నాయకులు భజన ప్రసాద్, ఎడమకంటి సుధాకర్రెడ్డి, కార్యదర్శి బర్ల ప్రభాకర్, గ్రామస్థులు, యువకులు పాల్గొన్నారు.

## ఇంటర్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘనసత్కారం



**బూర్గంపహాడ్, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఆదివారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో బూర్గంపహాడ్ గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినందుకు సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, గురుకులం ప్రిన్సిపాల్ హరితలు సోమవారం విద్యార్థులను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ద్వితీయ సంవత్సరంలో ఎ.సంజన ఎంపీసీలో 992, పి.రమ్య బైపీసీలో 992 మార్కులు సాధించగా ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో సవీరా 467, బైపీసీలో డి.రమ్యశ్రీ 435 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చారు. రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులను సత్కరించి ముమ్మందు మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు.

**తాళ్లగొమ్మూరులో...** మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు పంచాయతీకి చెందిన ఇంటర్నెట్ సెంటర్ నిర్వాహకుడు కుమార్తె గోవింద యశ్విత, బీజేపీ నాయకుడు శ్రీనివాసగౌడ్ కుమారుడు కేసగాని సతీష్లు ఇంటర్లో అత్యుత్తమ మార్కులు సాధించినందుకు తాళ్లగొమ్మూరు పంచాయతీ సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి రైతువేదికలో శాలువా, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ముమ్మందు మంచి ర్యాంకులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

# రోడ్డు భద్రత, సురక్షితమైనా ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

## పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** రోడ్డు భద్రత, సురక్షితమైనా ప్రయాణం అనేది ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నప్పుడే రోడ్డు ప్రమాదాలు నియంత్రణలో ఉంటాయని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా జరుగుతున్న ప్రాణనష్టాన్ని తగ్గించి, ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యానికి చేరాలనే ఉద్దేశంతో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 'అరైవ్ అలైవ్' అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజలను సమాయత్వం చేసేందుకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ విభాగాలు చెందిన అధికారులు ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ఖమ్మం రూరల్ మండలం, వరంగల్ క్రాస్ రోడ్డులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల గణాంకాలను పరిశీలిస్తే, ఎక్కువ శాతం ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, హెల్మెట్, సీటుబెల్ట్ వాడకంలో అలసత్వం వంటి కారణాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు అవగాహన అత్యంత అవసరమని భావించి 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాలు, జాతీయ రహదారులు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాలు, ఫంక్షన్ హాళ్లు వంటి చోట్ల ప్రజలను నేరుగా కలుసుకుని అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. – ఎడమ వైపు నుండి ఓవర్టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. భారీ వాహనాలు, నెమ్మదిగా వెళ్లే వాహనాలు ఎడమ వైపున, మిగిలినవి కుడి వైపున నడపాలన్నారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయరాదన్నారు. పార్కింగ్ లైట్లు లేకుండా పార్కింగ్ చేయరాదన్నారు. వాహనాలపై రేడియస్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలని, అప్రమత్తంగా, సురక్షితంగా ఉండటం చాల కీలకమని పేర్కొన్నారు. సురక్షితంగా రోడ్డు దాటడం కోసం పాఠశాలలు, పార్కుల దగ్గర రోడ్లపై 'నెమ్మదిగా నడపండి' అనే సైన్ బోర్డులను గమనించాలని సూచించారు.కార్యక్రమంలో రూరల్ ఇన్స్పెక్టర్ రాజు, విద్యుత్ శాఖ (ఏఈ) కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్, సీటు బెల్ట్ ధరించిన వారికి పూలతో స్వాగతించిన పోలీసులు



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** రోడ్డు భద్రతను, ట్రాఫిక్ నిబంధనలను పాటించేలా ప్రోత్సహించడానికి నగరంలో హెల్మెట్, సీటుబెల్ట్ ధరించిన వాహనదారులను అభినందిస్తూ ఖమ్మం వన్ టౌన్ పోలీసులు పూలతో స్వాగతం పలుకుతూ.. ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఖమ్మం వన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రతనియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించిన వారిని అభినందించడం, తద్వారా ఇతరులను కూడా ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రాణ రక్షణ ముఖ్యం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం. అలాగే, హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి పోలీసులు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేసే వారితో పాటు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాలు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీట్ బెల్టులు ధరించాలన్నారు. – ఎడమ వైపు నుండి ఓవర్టేక్ చేయడం నిబంధన విరుద్ధమని, ఓవర్టేక్ కేవలం కుడి వైపు నుండి మాత్రమే చేయాలన్నారు. రక్షణాత్మక డ్రైవింగ్ దృష్టి పెట్టాలన్నారు.

# రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చిన టూ టౌన్ పోలీసులు



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** 'అరైవ్ అలైవ్' ప్రచార కార్యక్రమంలో భాగంగా సరిత క్లినిక్ సెంటర్ రోడ్లపై ఏర్పడిన గుంతలను స్థానికులతో కలసి ఇన్స్పెక్టర్ బాలకృష్ణ , పోలీస్ సిబ్బంది పూడ్చారు.ప్రజా భద్రత ప్రాధాన్యత చర్యలలో భాగంగా రోడ్లపై ప్రమాదకరంగా మారిన పెద్ద గుంతలను పూడ్చి ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రమాదాల నివారణకు ఇది దోహదపడుతుందని ఇన్స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా వాహనదారులుకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణపై మరింత చైతన్యం రావాలి

## ఇన్స్పెక్టర్ మోహన్ బాబు



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రజల్లో మరింత చైతన్యం రావాలని ఖమ్మం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు అన్నారు. దేశవ్యాప్తంగానే కాకుండా రాష్ట్రంలోనూ రోజురోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వీటి నియంత్రణ కోసం ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు చేపట్టిన అరైవ్ – అలైవ్ కార్యక్రమాలలో భాగంగా టౌన్ ఏసీపీ రమణమూర్తి పర్యవేక్షణలో నగరంలోని మిర్చి మార్కెట్ కు వచ్చే రైతులకు, ట్రాలీ డ్రైవర్లకు అవగాహన పెంపొందించేందుకు వీలుగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రాముఖ్యతను ప్రతి పౌరుడి మనసులో బలంగా నాటేందుకే అరైవ్ అలైవ్ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా ప్రజలకు సురక్షిత డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేసి, రోడ్డు భద్రతా వ్యవస్థలను పటిష్ఠం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటు బెల్టులు పెట్టుకోకపోవడం, వాహనం నడుపుతూ సెల్ఫోన్ వాడడం, మద్యం సేవించి నడపడం, సిగ్నల్ జంప్, స్టాప్ లైన్ దాటడం, హైవేలపై ఆటోల ఓవర్ లోడింగ్, ఎడమవైపు నుంచి ఓవర్ టేకింగ్ వంటి ప్రమాదకర అలవాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉన్నదని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.

# హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేయండి: టౌన్ ఏసీపీ



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ద్విచక్ర వాహనదారుల ప్రాణ రక్షణ కోసం ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సురక్షితమైన ప్రయాణాలను ప్రోత్సహించేందుకు ఖమ్మం డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ అవగాహన బల్లేపల్లి లో నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించే ఉద్దేశ్యంతో 'హెల్మెట్ ఆన్.. లైఫ్ ఆన్' వంటి నినాదాలతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుతూ, ప్రమాదాల సమయంలో తల గాయాలు కాకుండా హెల్మెట్ ఎలా రక్షిస్తుందో వివరించారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. మనకోసం, మన ఇంటి వాళ్లు ఎదురు చూస్తుంటారని, మన ప్రాణాలు మన కుటుంబానికి ఎంతో ముఖ్యమని గుర్తించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

# జార్జిరెడ్డికి, అంబేద్కర్‌కు నివాళి




**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** జార్జిరెడ్డి పిడిఎస్‌యు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాలలో, నియోజకవర్గ కేంద్రాలలో, హాస్టల్లో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతినీ, ఇండియన్ లెజెండరీ లీడర్, యువ మేధావి, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు, అమరుడు జార్జిరెడ్డి 54వ వర్ధంతిని నిర్వహించారు. సోమవారం ఖమ్మం జిల్లా కేంద్రంలో ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కాలేజ్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమంత్, ఖమ్మం జిల్లా అధ్యక్షులు సురేష్, ఖమ్మం జిల్లా గర్ల్స్ కన్వీనర్ పైండ్ల శ్యామల మాట్లాడుతూ, ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల హక్కుల కోసం జార్జిరెడ్డి చేసిన పోరాటాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. నేటి క్యాంపస్లో కనిపిస్తున్న ప్రజాస్వామిక వాతావరణానికి ఆయన చేసిన త్యాగాలు, పోరాటాలే ప్రధాన కారణమని తెలిపారు. ఒక కులానికో మతానికో ప్రాంతానికో నాయకుడుగా కాకుండా, సమస్త మానవ సమాజానికి, స్ఫూర్తిదాయకంగా, అందరికీ హక్కులు కల్పించినటువంటి గొప్ప మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. జార్జిరెడ్డిని భౌతికంగా నిర్మూలిస్తే ప్రగతిశీల ఉద్యమం అస్తమిస్తుందని భావించిన ఆధిపత్య వర్గాల కుట్రలకు విరుద్ధంగా, ఆయన మరణం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసిందని అన్నారు. జార్జిరెడ్డి చూపిన పోరాట మార్గంలో నడుస్తూ ప్రభుత్వ విశ్వవిద్యాలయాల బలోపేతం, ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ, విద్యార్థి హక్కుల సాధన కోసం విద్యార్థి, యువత ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పిడిఎస్‌యూ జిల్లా నాయకులు నర్మదా, మన్విత, కృష్ణవేణి, జమల్, విష్ణు, గణేష్ ప్రవళిక ప్రణవ్, ఉపేందర్, మధురి, ప్రశాంత్ తదితరులు నాయకత్వం వహించారు.

# అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి: లింగాల రవికుమార్



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న సాంఘిక విప్లవ మూర్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల పూలమాలంకరణ బహిరంగ సభలు ర్యాలీలు అన్నదాన కార్యక్రమాలు ఆసుపత్రిలలో పండ్లు పంపిణీ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అంబేద్కర్ వాదులకు లింగాల రవికుమార్ పిలుపునిచ్చారు




## ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా

### – విద్యా నాణ్యతకు నూతన దిశ

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు 2026–27 విద్యా సంవత్సరం నుండి స్వయంప్రతిపత్తి హోదా లభించినందుకు కళాశాల యాజమాన్యం ఆనందం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల మహిళా విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యంతో స్థాపించిన మా కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా రావడం గర్వకారణమని, ఈ హోదాతో విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించే విధంగా ఆధునిక పాఠ్య ప్రణాళికలు, పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన శిక్షణా కార్యక్రమాలు అమలు చేస్తాము. మహిళా సాధికారతకు ఇది మరో ముందడుగు అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి గోపాల్ మాట్లాడుతూ స్వయంప్రతిపత్తి హోదా వల్ల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడానికి అవకాశం లభించింది. నూతన సిలబస్ రూపకల్పన, పరిశోధన, ఇంటర్న్‌షిప్లు, ప్లేస్మెంట్, హ్యాకథాన్లు వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని, మా అధ్యాపకులు ఈ విజయానికి ప్రధాన ఆధారం, వారి నిబద్ధత, కృషి, విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధ వల్లే ఈ హోదా సాధ్యమైందని, రాబోయే రోజుల్లో ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్లు, రీసెర్చ్ అవకాశాలు పెంచి, అధ్యాపకుల నైపుణ్యాలను మరింత పెంపొందించడానికి చర్యలు తీసుకుంటామని,మహిళా విద్యార్థుల సాధికారత మా సంస్థ స్థాపన లక్ష్యం. ఈ స్వయంప్రతిపత్తి హోదా ద్వారా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాల విద్య అందించగలుగుతామని, వారిని సాంకేతికంగా, సామాజికంగా, నాయకత్వ లక్షణాలతో అభివృద్ధి చేసి సమాజంలో మార్పు తీసుకురాగల నాయకులుగా తీర్చిదిద్దడం మా ధ్యేయం అని తెలిపారు. అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మాట్లాడుతూ ప్రియదర్శిని మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు స్వయంప్రతిపత్తి హోదా రావడం చాలా ఆనందంగా ఉందని,ఈ హోదా ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన విద్యను అందించే అవకాశం లభించిందని. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా సిలబస్లో మార్పులు చేసి, ప్రాక్టికల్ నాలెడ్జ్పై ఎక్కువగా దృష్టి పెడతామని తెలిపారు.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మరియు విద్యార్థులు ఈ విజయాన్ని సంబరంగా జరుపుకున్నారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు రావలసిన అన్ని రకాల బెనిఫిట్స్ వెంటనే అందజేయాలి

### : ఏఐఎస్టిఈ డిమాండ్

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగస్తుల అన్ని రకాల బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని అఖిలభారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం జాతీయ అధ్యక్షులు పి వి రమణ ప్రభుత్వాన్ని కోరారు. ఖమ్మం జిల్లా అధ్యక్ష గరిక శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శోభన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఖమ్మం జిల్లా అఖిలభారత గిరిజన ఉద్యోగస్తుల సంఘం సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వివిధ డిపార్ట్మెంట్లో, వివిధ హోదా లో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన 15 మంది గిరిజన ఉద్యోగస్తులను (లంబాడ, ఎరుకల, కోయ, నాయకపు, యానాది) ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాజాతీయ అధ్యక్షులు పి.వి. రమణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెలుగు నాగర్జున , జాతీయ కార్యవర్గ సభ్యులు, రాజయ్య నాయక్ , ఆర్టీసీ ఎంప్లాయిస్ , ఛైర్మన్ , కంప సురేష్ , జిల్లా డ్రాగ్ ఇన్స్పెక్టర్ , గడ్డం వినోద్ కుమార్ , ఆర్టీసీ ఎంప్లాయిస్ జోన్లు కన్వీనర్ పుట్టపర్తి బాలస్వామి, జిల్లా కోశాధికారి, శ్రీరాం ప్రసాద్ , గౌరవ సలహాదారులు, బానోత్ మంగ్య నాయక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నల్లగొండ శివకోటి , జిల్లా వైస్ ప్రెసిడెంట్ , పుట్టబంతి శ్రీనివాస్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ , జిల్లా మహిళా కార్యదర్శి ఆశ , దీప, సూపర్డెంట్ పే అకౌంట్స్ జిల్లా కార్యదర్శులు బానోతు ముత్తయ్య, జరుపుల వీరన్న, మరియు జిల్లా కార్యవర్గం ఎర్రబడీ ఇసాక్, గరిక సాంబశివరావు , సభ్యులు అంగిడి స్వామి, దుగ్గిరాల రామకృష్ణ , నల్లగొండ వెంకన్న , వెలుగు ఉపేందర్ , మొగిలి వెంకటేశ్వర్లు, కుర్ర శివ , ఏ రాములు, పడిగాపులు సత్యనారాయణ , దబ్బ రమణ , బీమా మొదలైన వారు పాల్గొన్నారు .



## ఓటు బ్యాంకు రాజకీయాలకే అంబేద్కర్ను పరిమితం చేశారు

### అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతర కృషి
### బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** గత పాలకులు బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరును కేవలం తమ స్వార్థ రాజకీయాల కోసం, ఓటు బ్యాంకు కోణంలోనే వాడుకున్నారని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. సోమవారం ఖమ్మం నగరంలోని 58వ డివిజన్ రమణగుట్టలో మేకల నాగేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వారోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ముందు జ్యోతి ప్రజ్వలనచేసి, నివాళులర్పించిన అనంతరం ఆయన పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్రం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే అంబేద్కర్కు సరైన గౌరవం దక్కిందని కోటేశ్వరరావు పేర్కొన్నారు. గతంలో అంబేద్కర్ను కేవలం కొన్ని వర్గాల నాయకుడిగానే చూపే ప్రయత్నం జరిగిందని, కానీ మోదీ ప్రభుత్వం ఆయనను దేశ రాజ్యాంగ సృష్టికర్తగా, అన్ని వర్గాల ప్రజల మహోన్నత వ్యక్తిగా ప్రపంచానికి చాటిచెప్పిందన్నారు. స్మృతి వనాల ఏర్పాటు, జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా అంగరంగ వైభవంగా నిర్వహించడం వంటి చర్యల ద్వారా ఆయన గౌరవాన్ని ఇనుమడింపజేసిందని కొనియాడారు. అంబేద్కర్ వాస్తవ జీవిత చరిత్రను, ఆయన ఉన్నతమైన ఆలోచనలను భావి తరాలకు అందించడంలో బీజేపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని వివరించారు.ఓటు హక్కును కల్పించి, రాజ్యాంగబద్ధం చేయడం ద్వారా భారతీయులందరికీ తమ తలరాతను తామే రాసుకునే గొప్ప అవకాశాన్ని కల్పించిన మహనీయుడు అంబేద్కర్ అని ఆయన స్మరించుకున్నారు. అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక రమణగుట్ట ప్రాంతంలోని కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి, మరిన్ని మౌలిక వసతుల కల్పనకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఖమ్మం నగర రెండో పట్టణ అధ్యక్షుడు ధన్యాకుల వెంకటనారాయణ, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, మేకల నాగేంద్ర, బోయల వెంకట్, నక్కల రవిగౌడ్, కందుల శ్రీకృష్ణ, రుద్ర గాని మాధవ్, బోయినపల్లి సురేష్, కందుల శ్రీకృష్ణ, నాగరాజు,భద్రం తదితరులు పాల్గొన్నారు.

## దళితుల పట్ల కొనసాగుతున్న వివక్ష

### –సద్వినియోగం కానీ సబ్ ప్లాన్ నిధులు
### –డిహెచ్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత వర్గాల సంక్షేమంలో వివక్ష పాటిస్తున్నాయని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఏసురత్నం తెలిపారు. సబ్ ప్లాన్ నిధులను కేవలం బడ్జెట్లో కేటాయిస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో వినియోగించడం లేదని ఆయన ఆరోపించారు. దళిత హక్కుల పోరాట సమితి ఖమ్మం జిల్లా మహాసభ సోమవారం స్థానిక గిరి ప్రసాద్ భవన్లో జరిగింది. యామాల గోపాలరావు, సృజన అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభలో ఏసురత్నం మాట్లాడుతూ సామాజికంగా వివక్షకు గురవుతున్న వర్గాలపై పాలకులు దృష్టి సారించడం లేదన్నారు. అనేక దశాబ్దాలుగా దళితుల కోసం కేటాయిస్తున్న నిధులు సద్వినియోగం కావడం లేదని పక్కా దారి పట్టడం వల్లే దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిపోతున్నారని ఆయన తెలిపారు. దళితులకు జనాభా దామాషా పద్ధతి ప్రకారం బడ్జెట్లో నిధులు కేటాయించాలని ఈ ఏడాది బడ్జెట్లో 20 శాతం ఉన్న దళితులకు కేవలం 16 శాతం మాత్రమే కేటాయింపులు జరిగాయని ఆయన తెలిపారు. ఆర్థిక రాజకీయ ఆధిపత్యాన్ని ప్రశ్నించి సమసమాజం వైపు నడిపించేలా దళిత హక్కుల పోరాట సమితి కృషి చేస్తుందన్నారు. దళిత వర్గాలను రాజకీయంగా, సామాజికంగా చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని ఆయన సూచించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థలు ఇతర వ్యవహారాల్లో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. ప్రభుత్వ రంగం పూర్తిగా నిర్వీర్యమై ప్రైవేటు రంగంలోనే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉన్నందున ప్రైవేటు రంగంలోనూ దళితులకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దళితుల అభ్యున్నతి కోసం, సామాజిక చైతన్యం కోసం కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, డిహెచ్పిఎస్ నాయకులు యంగల ఆనందరావు, పగిడిపల్లి ఏసు, తడికమళ్ల ఏబు, తోటపల్లి సీతారాములు, మామిడాల కిరణ్, వరదా నర్సింహారావు, నారపోగు వసంతరావు, నాగేశ్వర రావు, మాతంగి శ్రీనివాసరావు, రామకృష్ణ, రవి పాల్గొన్నారు.



### –అధ్యక్ష, కార్యదర్శులుగా ఏసు, ఆనందరావు

దళిత హక్కుల పోరాట సమితి ఖమ్మంజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా పగిడిపల్లి ఏసు, యంగల ఆనందరావును మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. 31 మందితో జిల్లా సమితిని, 18 మందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా తడికమళ్ల ఏబు, ఉపాధ్యక్షులుగా నాగేశ్వరరావు, సీతారాములు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా యామాల గోపాలరావు, సహాయ కార్యదర్శులుగా వరదా నర్సింహారావు, మామిడాల కిరణ్,1/2నారపోగు వసంతరావు, కోశాధికారిగా సృజన లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు ఏసు, ఆనందరావులు మాట్లాడుతూ దళిత హక్కులు, సంక్షేమం కోసం పోరాడతామని తెలిపారు.

## 48వ డివిజన్ గణేష్ నగర్‌లో మిషన్ భగీరథ పైపులు ఏర్పాటు

### కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** 48వ డివిజన్ గణేష్ నగర్ ప్రాంతంలో ప్రజలకు మంచినీటి కష్టాలకు చెక్ పెట్టే విధంగా డివిజన్ కార్పొరేటర్ తోట గోవిందమ్మ రామారావు మిషన్ భగీరథ పైపులను ప్రభుత్వం అధికారుల సమన్వయంతో ఏర్పాటు చేయిస్తున్నారు. పైపుల ఏర్పాటు చేసే క్రమంలో అడ్డుగా వస్తున్న బండ రాళ్లను తొలగించారు. ఈ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో విద్యుత్ అధికారులచే కొత్త స్తంభాలను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని డివిజన్ కార్పొరేటర్ తెలిపారు. డివిజన్‌లో జరుగుతున్న ఈ అభివృద్ధి పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

## – తక్షణ చర్యలకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుండి అందిన వినతిపత్రాలు, ఫిర్యాదులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, గృహనిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తో కలసి స్వీకరించారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్ణీత గడువులో పూర్తిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దారులు, ఎంపీడీవోలు మరియు ఇతర సంబంధిత అధికారులతో మండలాల వారీగా అందిన సమస్యలను నేరుగా చర్చించి, పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి వినతిపత్రాన్ని సమగ్రంగా పరిశీలించి సమస్యల మూలాలను గుర్తించి దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదులను పూర్తి వివరాలతో పాటు అవసరమైన ఆధార పత్రాలతో సమర్పిస్తే పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అనంతరం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు తక్షణం ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

**ప్రజావాణి దరఖాస్తుల్లో ముఖ్యమైనవి...**

టేకులపల్లి మండలం కొత్త తాండ గ్రామపంచాయతీకి చెందిన గ్రామ ప్రజలు తమ గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో 4.5 కిలోమీటర్లు ప్రయాణించి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. గ్రామం మారుమూల ప్రాంతంలో ఉండడం వల్ల వాహన సౌకర్యం లేక వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో రేషన్ డీలర్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్, తగు చర్యల నిమిత్తం కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు. పాల్వంచ గాంధీనగర్కు చెందిన మంగళగిరి నాగమ్మ తనకు సర్వే నం. 817/36లో భూమి ఉన్నప్పటికీ భూభారతి ఆన్లైన్లో నిషేధిత భూమిగా చూపిస్తున్నారని, దాన్ని తొలగించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ధరణి ఆపరేటర్కు ఎండార్స్ చేశారు. భద్రాచలం రాజుపేటకు చెందిన శివకుమార్ పదో తరగతి ఉత్తీర్ణుడై 80 శాతం దివ్యాంగుడిగా ఉండి కుటుంబ పోషణ కష్టంగా మారిందని, దివ్యాంగుల కోటాలో మోటార్ బైక్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం సంబంధిత దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఇల్లందు ఎల్బీఎస్ నగర్కు చెందిన తాటి లాలయ్య తాను దివ్యాంగుడిగా 2022లో 70% అంగవైకల్యంతో సదరం సర్టిఫికేట్ పొందినప్పటికీ ఇప్పటివరకు వికలాంగుల పెన్షన్ మంజూరు కాలేదని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం డీఆర్డీఓకు ఎండార్స్ చేశారు. చర్ల మండలం ఆనంద కాలనీకి చెందిన ప్రజలు తమ గ్రామంలో కొంతమంది అర్హత లేని వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎస్టీ కుల ధ్రువీకరణ పొందుతున్నారని, దీనివల్ల నిజమైన గిరిజనులకు సంక్షేమ పథకాలు మరియు ఉద్యోగ అవకాశాల్లో నష్టం జరుగుతోందని, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి డీ–సెక్షన్ ఓఎస్డీకి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

## – ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన ప్రజలు గ్రామంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన స్థలం ఆక్రమణకు గురైందని, సంరక్షించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహశీల్దార్కు, ఎంఇకు రాశారు. కూసుమంచి మండలం ముత్యాలగూడెం గ్రామానికి చెందిన బి.స్వప్న తనకు మతి స్థిమితం సరిగ్గా ఉండదని, సదరం సర్టిఫికెట్ ఉందని, తనకు దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డిఆర్డిఓకు రాశారు. బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన ఎం.దేవేంద్రరావు రిజిస్టర్డ్ విక్రయ దస్తావేజు ద్వారా రాపల్లిలో క్రయం పొందిన వ్యవసాయ భూమిని నకిలీ సాధా బైనామా ద్వారా మంజుల సునీల్ పేరున మార్పిడి చేసి పట్టా పాస్ పుస్తకము మంజూరు చేశారని, దానిని రద్దుచేసి తన పేరు మీద పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం ఆర్డిఓ కు రాశారు. కొణిజెర్ల మండలం గుబ్బగుర్తి గ్రామ పంచాయతీ వాసులు పెద్దమ్మ తల్లి దేవాలయం స్థలాన్ని కొంతమంది ఆక్రమణ చేస్తున్నారని దానిని సర్వే చేయించి భవిష్యత్తులో ఎటువంటి ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ డి విభాగం పర్యవేక్షకులకు రాస్తూ వెంటనే ఆర్డిఓ ద్వారా విచారణ చేయించి వారం రోజులలో రిపోర్ట్ అందించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళనకరంగా వ్యవసాయ మార్కెట్ పనులు

**– భవిష్యత్‌లో మిర్చి పంట భారీగా వస్తే రవాణాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం**

**– అభివృద్ధి పనుల్లో జాప్యంతో ఇబ్బందులు పడుతున్న రైతులు**

**– ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ**



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు ఆందోళన కరంగా సాగుతున్నాయని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ ఆరోపించారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బి ఆర్ ఎస్ త్రీ టౌన్ ప్రాంత ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.150కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయిలో మోడల్ మిర్చి మార్కెట్గా తీర్చిదిద్దుతున్నామంటూ చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తే ముందస్తు ప్రణాళిక లేమితో పూర్తి వాస్తు దోషంగా జరుగుతున్నట్లుగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం చేపట్టే మార్కెట్ విషయంలో ముందుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి సలహాలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. మార్కెట్ లోపలి ప్రాంగణాన్ని పెంచుతూ చుట్టూ ఉన్న రోడ్లన్నింటినీ తగ్గించడం వల్ల భవిష్యత్తుల్లో రవాణా వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులను తెచ్చి పెడుతుందన్నారు. మార్కెట్ చుట్టూ ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్లను కుంచించి 25అడుగులు ఉండేలా చేయడం అభివృద్ధి ఎలా అవుతుందో పాలకులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం నగరంలోని రోడ్లన్నింటినీ వెడల్పు చేస్తుంటే అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి జరిగే మార్కెట్ చుట్టు ఉన్న రోడ్లను తగ్గించడం సరైనది కాదన్నారు. భవిష్యత్తులో మార్కెట్కు పెద్ద మొత్తంగా మిర్చి తరలివస్తే మార్కెట్లోకి వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అంతేకాక గ్రెయిన్ మార్కెట్ ప్రధాన గేటు నుంచి లోపలి కి వెళ్లే రోడ్డును తొలగించి భారీ షెడ్లను నిర్మించడం పూర్తి వాస్తుదోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. భారీ వాహనాలు మార్కెట్ లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా ప్రస్తుత మార్కెట్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. త్రీటౌన్ ప్రాంతానికి గుండెకాయ లాంటి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిని ప్రణాళిక లేమితో చేపట్టి రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడం బాధాకరమన్నారు. సంక్రాంతి నాటికే మోడల్ మార్కెట్ పనులు పూర్తి చేసి రైతులకు అప్పగిస్తామని చెప్పిన అధికారుల, ఆ దిశగా పనులు ముగించకపోవడం మార్కెట్ లో పనులు జరిగే తీరును తెలియజేస్తుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్లో లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని, మోడల్ మార్కెట్ పనులు పూర్తయ్యే నాటికి అంతర్జాతీయ స్థాయి మార్కెట్కు తగినట్లుగా ఉద్యోగుల నియామకం చేపట్టాలని కోరారు. అంతేకాక అంతర్జాతీయ మిర్చి హబ్ గా తయ్యారయ్యే మార్కెట్ కు అనుగుణంగా రైతులకు అవసరమైన సౌకర్యాలను సైతం సమకూర్చాలన్నారు. ప్రభుత్వమే కోల్ స్టోరేజీ, గోదాముల నిర్మాణం చేపట్టి రైతులు ఉచితంగా పంటలను దాచుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన షెడ్ల ఆనవాళ్లు లేకుండా చేసిన అధికారులు, వాటికి వేలం వేసిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, బిఆర్ఎస్ నాయకులు కస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# ‘ అరైవ్ – అ లైవ్ కార్యక్రమాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (మనంప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న అరైవ్ – అ లైవ్ కార్యక్రమాల ‘వాల్ పోస్టర్‘ జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే ప్రధాన కారణమవు తున్నాయని పేర్కొంటూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అరైవ్ – అ లైవ్ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యతా యుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం లక్ష్యమని వివరించారు. హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, అధిక వేగంతో వాహనాలు నడపక పోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ఉండడం వంటి భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. యువత ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలను గౌరవిస్తూ, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. గ్రామసభలు, అవగాహన ర్యాలీలు, పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు, డ్రైవర్లకు శిక్షణ శిబిరాలు, ప్రజలకు అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ పాల్గొన్నారు.

# రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం అస్సలు సహించం

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**ఏప్రిల్ 25లోపు 330 స్లాట్ బుకింగ్లు క్లియర్ చేయాలి**
**భూ భారతి ఆమోదిత దరఖాస్తులు వెంటనే అప్డేట్ చేయాలి**
**సాదా బైనామా దరఖాస్తుల్లో తప్పిదాలు అస్సలు ఉండకూడదు**
**రెవెన్యూ శాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్**

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం అస్సలు సహించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ, భూ భారతీ, సాదా బైనామా, ఇతర రెవెన్యూ సంబంధిత పెండింగ్ అంశాలపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సమీక్షించారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అభివృద్ధి పనులు సమయానికి పూర్తి కావాలంటే భూ సేకరణలో ఎటువంటి జాప్యం ఉండకూడదన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూములను గుర్తించి చట్టబద్ధమైన విధానాల ప్రకారం త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ముందుగా పెండింగ్లో ఉన్న మెయిన్ కాలువల పనులపై దృష్టి సారించి, అన్ని సమస్యలను పరిష్కరించాలని, రైతులతో చర్చించి వారిని ఒప్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు.జాతీయ రహదారుల పనులకు సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో రైతుల వల్ల ఫీల్ స్థాయిలో పనులు నిలిచిపోతున్నా యని తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే రైతులతో సమన్వయం చేసుకొని భూములను స్వాధీనం చేసుకోవాలని, చట్టంపై అవగాహన కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులను అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. రికార్డులు పరిశీలించి, నాలా ప్రక్రియలు, లేఅవుట్ అనుమతులు, తదితర అంశాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే పరిహారం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మూడవ రైల్వే లైన్కు సంబంధించిన పెండింగ్ భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమోదం పొంది ఇంకా భూ భారతి పోర్టల్లో అప్డేట్ కానీ దరఖాస్తులపై సమీక్షించి అప్డేట్ కాకపోవడానికి గల కారణాలపై తహసీల్దార్లను కలెక్టర్ ప్రశ్నించారు. భూ భారతి పోర్టల్లో వివరాలను తక్షణమే అప్డేట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని, నిర్దేశిత కాలపరిమితిలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు.ఏప్రిల్ 25 లోపు 330 పెండింగ్ స్లాట్ బుకింగ్లను తహసీల్దార్లు పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. పట్టాదారు యాజమాన్యంపై ఎటువంటి సందేహాలు ఉన్నా పరిశీలించి నిబంధనల ప్రకారం పట్టా రద్దు ప్రక్రియను చేపట్టాలని, కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ స్లాట్ బుకింగ్లను పెండింగ్లో ఉంచకూడదని స్పష్టం చేశారు. సాదా బైనామా దరఖాస్తుల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు. సాదా బైనామా ప్రక్రియలో ఎటువంటి తప్పిదం ఉండకూడదని, ఏ చిన్న పొరపాటు జరిగినా తహసీల్దార్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి దరఖాస్తును స్పష్టంగా, నిబంధనల ప్రకారం పరిశీలించాలని, మంజూరు చేసిన వాటిని క్రాస్ చెక్ చేస్తామని ఎటువంటి అక్రమాలు గుర్తించినా తీవ్ర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్లను కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు.స్లాట్ బుకింగ్ సేవలను కూడా పూర్తి స్థాయిలో వినియోగం కావడం లేదని అన్నారు. ప్రజలకు స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత 6 నెలల్లో స్లాట్ బుకింగ్ రద్దులకు గల కారణాలతో సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు.అక్రమ గనుల తవ్వకాలపై పూర్తిస్థాయిలో నియంత్రణ విధించాలని జిల్లా కలెక్టర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా ఎటువంటి గనుల తవ్వకాలు జరగ కూడదని, రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా అక్రమ మైనింగ్ జరగడం అసాధ్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలోనే ఈ అంశంపై కఠిన సూచనలు ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఎటువంటి వాహనాన్ని విడుదల చేయరాదని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేసిన వారిపై 10 వేల, 20 వేలు వంటి చిన్నపాటి జరిమానాలు విధించడం కాకుండా, తప్పనిసరిగా వాహనాలను సీజ్ చేసి, ఆర్సీని కూడా స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, ఇరిగేషన్, నేషనల్ హై వే, రైల్వేస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఏడి మైన్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సెన్సస్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 13 (మనంప్రతినిధి):** సెన్సస్కు సంబంధించిన పెండింగ్లో ఉన్న పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.తెలంగాణ రాష్ట్రంలో సెన్సస్-2027 ఏర్పాట్లపై డీసీఓ భారతి హోళీకేరి సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చార్జ్కు సంబంధించిన ప్రతిపాదనలు అన్ని జిల్లాలు సమర్పించాల్సి ఉండగా, కొన్ని జిల్లాలు మాత్రమే వివరాలు అందించాయని, మిగతా జిల్లాలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు.ఇళ్ల గణనకు సంబంధించి జిల్లా, మండల స్థాయిలో భూభాగ గణాంకాల్లో ఉన్న వ్యత్యాసాలపై కూడా చర్చించారు. వివిధ వనరుల నుండి వచ్చిన డేటాలో ఒకే డేటాను ఖరారు చేసి, జిల్లా సెన్సస్ అధికారి ద్వారా ధృవీకరించి పంపించాలని సూచించారు. ఇతర మార్గాల ద్వారా పంపిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.ఎన్యూమరేటర్ల మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ వంటి సెన్సస్ సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. చార్జ్ అధికారులకు నేరుగా పంపబడే ఈ సామగ్రిని స్వీకరించి, పరిమాణాన్ని ధృవీకరించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వంద శాతం లక్ష్యంతో పాటు అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.సెన్సస్-2027 కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని డీసీఓ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐడీఓసీ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే విస్తృత స్థాయిలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సెన్సస్కు సంబంధించిన ప్రతి దశను సమయపాలనతో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పిస్తూ పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫీల్ స్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తుగా పర్యవేక్షణ చేపడుతున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు .సెన్సస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యంగా అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాలు

**- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**
**రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరూ అవగాహనంతో అప్రమత్తంగా ఉండాలి**
**రోడ్డు భద్రత వార్షికోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను అవిష్కరించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** ప్రజల ప్రాణ భద్రతే లక్ష్యమని, రోడ్డు భద్రతపై అప్రమత్తత అవసరమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తోన్న అరైవ్ - అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల వాల్ పోస్టర్లు, కరపత్రాలను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరి పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అలవాట్లు ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. టూ వీలర్ వాహనదారులు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదు అని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం వలన ఇతరులకు కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. పాదచారులు కూడా జాగ్రత్తగా రోడ్లు దాటాలని, నిర్దేశిత జీబ్రా క్రాసింగ్లను వినియోగించాలని చెప్పారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను తగ్గించవచ్చని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ట్రాఫిక్ నిబంధనల పట్ల బాధ్యతాయుత ప్రవర్తనను అలవరచడం, రోడ్డు ప్రమాదాలను తగ్గించి, ప్రాణ నష్టాన్ని నివారించడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.

# తక్కువ ఆదాయ వర్గాలకు శ్రీరామ్ హిల్స్ వద్ద ఫ్లాట్లు..

**9 లక్షల 90 వేలకు అందుబాటులోకి రానున్న 450 ప్లింత్ ఏరియా ఫ్లాట్ : కలెక్టర్**

**ఖమ్మం, ఏప్రిల్ 13(మనం బ్యూరో):** తక్కువ ఆదాయ వర్గాలకు బోనకల్ రోడ్ శ్రీ రామ్ హిల్స్ వద్ద 450 ప్లింత్ ఏరియా ఫ్లాట్లు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.సోమవారం కలెక్టరేట్లో తెలంగాణ గృహ నిర్మాణ మండలి ఆధ్వర్యంలో బోనకల్ రోడ్డులో శ్రీ రామ్ హిల్స్ వద్ద నిర్మించిన ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి జిల్లా అధికారులకు వివరించారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ బోనకల్ రోడ్డులో మొత్తం 126 ఫ్లాట్లు సిద్ధంగా ఉన్నాయని, ఒక్కో ఫ్లాట్ ధర 9 లక్షల 90 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు.ఈ ఫ్లాట్లకు దరఖాస్తు చేసుకునే ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 18 లోపు మీ సేవా కేంద్రాల ద్వారా ఒక లక్ష ముందస్తు చెల్లింపును చేయాలని సూచించారు. ఫ్లాట్ కేటాయింపు జరగనట్లయితే చెల్లించిన ఒక లక్షను తిరిగి చెల్లిస్తామని తెలిపారు.గతంలో యాక్సెస్ సమస్యల కారణంగా ఎవరూ ముందుకు రాలేదని, ప్రస్తుతం ఆ సమస్య పూర్తిగా పరిష్కరించబడిందని, కాలనీకి పూర్తి స్థాయి రహదారి సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు.తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన ఉద్యోగులు, ముఖ్యంగా నాలుగో తరగతి సిబ్బంది, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.దరఖాస్తుదారులు ఖమ్మం జిల్లాకు చెందిన వారై ఉండాలని, వారి నెలవారీ ఆదాయం రూ. 25 వేల నుండి రూ. 50 వేల మధ్య ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల మధ్య ఏప్రిల్ 22న లాటరీ విధానం ద్వారా పారదర్శకంగా ఫ్లాట్లను కేటాయిస్తామని తెలిపారు.లాటరీలో ఎంపికైన వారికి కేటాయింపు అనంతరం 15 రోజులలో 25 శాతం మొదటి విడత చెల్లించాల్సి ఉంటుందని, 60 రోజులలో 50 శాతం రెండవ విడత, 90 రోజులలో మిగిలిన 25 శాతం మూడవ విడత చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.జిల్లాలోని అన్ని శాఖాధికారులు తమ సిబ్బందికి ఈ కాలనీ గురించి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తెలంగాణ గృహ నిర్మాణ మండలి ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులుండగా ప్రైవేట్ వైపు పరుగులెందుకు..?

## తల్లిదండ్రులు మారాలని పిలుపు

## ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మందడి ఇజ్రాయిల్



**తిరుమలాయపాలెం ఏప్రిల్ 13 మనం న్యూస్** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యాసంస్థల వైపు మొగ్గు చూపడం బాధాకరమని ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మందాడి ఇజ్రాయిల్ అన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలపై మాట్లాడుతూ, లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడం కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాలను ఉదాహరణగా చూపిస్తూ, ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని తెలిపారు. తక్కువ వనరులతోనే అద్భుత ఫలితాలు సాధించడం ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలాన్ని తెలియజేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫార్ములు, డిజిటల్ విద్య వంటి అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు వాటిని వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రైవేట్ అంటేనే మంచి చదువు" అనే అపోహలను విడిచిపెట్టాలని, సమాజంలో అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నప్పటికీ, అదే విద్యను నిర్లక్ష్యం చేయడం సరైంది కాదన్నారు. తల్లిదండ్రులారా ఒక్కసారి ఆలోచించండి... మీ పిల్లల భవిష్యత్తు కోసం అనవసరంగా లక్షల రూపాయలు ఖర్చు చేయడం కంటే, ప్రభుత్వ విద్యను నమ్మాలని ఆయన పిలుపునిచ్చారు. చివరగా, "మారండి... మీ పిల్లల జీవితాలు మార్చండి... ప్రభుత్వ పాఠశాలలకు పంపండి" అని మందడి ఇజ్రాయిల్ విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు భద్రతపై ప్రజల భాగస్వామ్యం కీలకం

## ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ సాధ్యం: పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13(మనం న్యూస్)** ఖమ్మం రూరల్ మండలం వరంగల్ క్రాస్ రోడ్డులో తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల పాత్ర కీలకమని అన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. ట్రాఫిక్ నియమాల పట్ల చైతన్యం రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకున్నప్పుడే ప్రమాదాలను తగ్గించవచ్చని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ రూపొందించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో ట్రాఫిక్ నియమాలపై చైతన్యం పెంచుతున్నామని తెలిపారు. జిల్లాలో జరుగుతున్న ప్రమాదాలలో అధిక శాతం మానవ నిర్లక్ష్యం కారణంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, మొబైల్ ఉపయోగించడం, ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం ప్రధాన కారణాలన్నారు. ద్విచక్ర వాహనదారులు మరియు వెనుక కూర్చునే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగం ద్వారా ప్రాణనష్టం తగ్గించవచ్చని తెలిపారు. ఎడమవైపు నుండి ఓవర్‌టేక్ చేయకూడదని, కుడివైపు నుంచే సురక్షితంగా ఓవర్‌టేక్ చేయాలని సూచించారు. ప్రధాన రహదారులపై పార్కింగ్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రివేళల్లో పార్కింగ్ లైట్లు మరియు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. పాఠశాలలు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను నేరుగా చైతన్యపరుస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఇన్స్పెక్టర్ రాజు, ఏఈ కోటేశ్వరరావు, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా టిఎస్ యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



**ఎర్రుపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్)** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) 13వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఎస్ ఎర్రుపాలెం నందుటిఎస్ యుటిఎఫ్ జెండా ఆవిష్కరణను టీఎస్ యుటిఎఫ్ ఎర్రుపాలెం మండలం అధ్యక్షులు కంచర్ల శ్రీనివాసరావు చేయడం జరిగింది సమావేశం నిర్వహించడం జరిగిందిఈ సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్సి రెండున్నర సంవత్సరాలు గడిచిపోతున్న నివేదిక బయట పెట్టకుండా సంఘాలతో చర్చలు జరపకుండా జాప్యం చేయడం మంచిది కాదని,వెంటనే నివేదికను బహిర్గతపరిచి సంఘాలతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన ఫిట్మెంట్తో పిఆర్సి ఇవ్వాలని డిమాండ్ చేశారు అదేవిధంగా హెల్త్ కార్డ్స్ వెంటనే ప్రాసెస్ పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సిపిఎస్ విధానం రద్దుచేసి తమ హామీ నిలబెట్టుకోవాలన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసి ఛైర్మన్ బండారు



**మధిర టౌన్, ఏప్రిల్ 13 (మనం న్యూస్** మధిర మెప్మా ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ నందు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాతతో కలిసి మధిర మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండారు నరసింహారావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులకు న్యాయం చేయాలని ఉద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆయన తెలిపారు రైతుకి నష్టం కలిగించకూడదని రైతుని రాజు చేయాలని ఉద్దేశంతో రైతులకు మేలు కల్పించడం లక్ష్యంతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు చొరవతో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ ఛైర్మన్ కోనా ధని కుమార్ ,మున్సిపల్ కమిషనర్ సంపత్, 22వ వార్డు కౌన్సిలర్ నాగార్జున ,కాంగ్రెస్ నాయకులు రామనాథం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# గుర్రాలపాడులో ఉచిత మెగా వైద్య శిబిరం

**ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13(మనం న్యూస్):** ఖమ్మం రూరల్ ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు అంగన్వాడి కేంద్రంలో ఖమ్మం గ్రానైట్ ట్రేడర్స్ అండ్ మార్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ యశోద హాస్పిటల్, వాసన్ ఐ కేర్ ఖమ్మం వైద్య బృందాలు పాల్గొని రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు, కంటి పరీక్షలు వంటి పలు టెస్టులు నిర్వహించగా, సాధారణంగా రూ.2000--3000 వరకు అయ్యే పరీక్షలను ఉచితంగా చేయించడం విశేషం. శిబిరానికి వచ్చిన వారికి భోజనాలు, మజ్జిగ, పండ్లు వంటి ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అదాలత్ నరేందర్, వెంపటి వెంకటేశ్వర్లు, వెంపటి ఉపేందర్, నునావత్ కిషన్, షేక్ పాషా, కత్రం గిరి, షేక్ జానీ తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకం: ఎస్సై వీరేందర్

**చింతకాని, ఏప్రిల్13(మనం న్యూస్):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణ, మరణాల రేటును తగ్గించేందుకు రోడ్డు భద్రత నియమాలు పాటించేలా ప్రజలను సమాయత్వం చేసేందుకు సోమవారం చింతకాని మండల కేంద్రంలో గ్రామపంచాయతీ వద్ద రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం అరైవ్ అలైవ్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. చింతకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతకాని నుండి జగన్నాధపురం వెళ్లే మార్గమధ్యంలో రోడ్లపై అడ్డుగా వున్న చెట్ల పొదలను తొలగించి రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైరా సీఐ వెంకట ప్రసాద్, చింతకాని సర్పంచ్ మనోహర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు

# ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తల్లపురెడ్డి సత్య భార్గవ్ ప్రతిభ



**ఎర్రుపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం ఇంటర్ ప్రథమ,ద్వితీయ ఫలితాలు విడుదలయ్యాయి ఈ ఫలితాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు లో సత్తా చాటారు ఎర్రుపాలెం మండలం చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తలపురెడ్డి కృష్ణారెడ్డి లక్ష్మి ప్రభావతి దంపతుల కుమారుడు తల్లపురెడ్డి సత్య భార్గవ్ రెడ్డి అనే విద్యార్థిని ఇంటర్ (ఎంపీసీ) ప్రథమ సంవత్సరం ఫలితాలలో 467/470 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించిందు సత్య భార్గవ్ రెడ్డి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 467 మార్కులు సాధించినందుకు, సర్పంచ్ బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీ నాయకులు, బంధుమిత్రులు స్థానికులు అభినందనలు తెలిపారు

# పెద్దగోపవరం గ్రామంలో అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహణకు ఏర్పాట్లు



**ఎర్రుపాలెం, ఏప్రిల్ 13 (మనం న్యూస్) :** మండల పరిధిలో పెద్ద గోపవరం గ్రామంలో ఘనంగా అంబేద్కర్ జయంతి నిర్వహించబడును ఈ సందర్భంగా.గ్రామ మాజీ సర్పంచ్ ఇనపనూరి శివాజీ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు,గ్రామ పెద్దలు యువతి యువకులు భారీ ఎత్తున పాల్గొనాల్సిందిగా ఆదర్శంగా నిలవాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అభిమానులు పాల్గొనవలసిందిగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యూత్ సభ్యులు కోరారు.

# తొలి జీవితం...కష్టాల్లో కరిగిన వ్యక్తిత్వం



- **సామాజిక సమానత్వానికి శాశ్వత దీప్తి మన 'అంబేద్కర్'**
- **ఆయన ఆలోచనల ప్రాసంగికత.. నేటికీ ఆచరణీయం...**
- **శిక్షణ పొందండి -- సంఘటితమవండి -- పోరాడండి...**
- **సమాజ మార్పుకు అంబేద్కర్ ఇచ్చిన శాశ్వత మంత్రమే రాజ్యాంగం...**

అణగారిన వర్గంలో జన్మించిన అంబేద్కర్ చిన్న నాటి నుంచే తీవ్రమైన కులవివక్షను అనుభవించారు. పాఠశాలలో సాధారణ హక్కులకే నోచుకోని పరిస్థితులు ఆయనను ఆలోచింపజేశాయి. ఈ అనుభవాలే ఆయనలో తిరుగుబాటు భావనను పెంచి, విద్యనే ఆయుధంగా మార్చాయి. ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించి, తన ప్రతిభతో భారతదేశానికి మార్గదర్శకుడయ్యారు. అంబేద్కర్ పోరాటం కేవలం ఒక వర్గం కోసం మాత్రమే కాదు; అది సమాజం మొత్తం కోసం. కులవ్యవస్థ నిర్మూలన, సమాన హక్కుల సాధన ఆయన ప్రధాన లక్ష్యం. " చట్టాలు మారితే సరిపోదు, మనసులు మారాలి " అనే సందేశం ఆయన ఆలోచనల గుండెకాయ. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని అంబేద్కర్ విశ్వసించారు. వెనుకబడిన వర్గాలకు విద్య అందించడం ద్వారా సమాజంలో సమానత్వం తీసుకురావచ్చని ఆయన నమ్మకం. నేటి ప్రభుత్వాలు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ సౌకర్యాల ద్వారా ఈ ఆశయాన్ని కొనసాగిస్తున్నాయి.

**రాజ్యాంగం ... సమానత్వానికి బలమైన పునాది**

భారత రాజ్యాంగ రూపకర్తగా అంబేద్కర్ ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించే విధంగా చట్టాలను రూపొందించారు. మౌలిక హక్కులు, సామాజిక న్యాయం, రక్షణ చర్యలు - అల్ థిస్ స్టాండ్ యస్ పిల్లర్స్ ఆఫ్ ఇండియన్ డెమోక్రసీ అని నిరూపించారు. రిజర్వేషన్ విధానం ద్వారా శతాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం అంబేద్కర్ దృష్టిలో సామాజిక న్యాయం సాధన. ఇది ఒక ప్రత్యేక సౌకర్యం కాదు - సమానత్వానికి ఒక సాధనం అని చాటిచెప్పారు.

**ఎస్సీ వర్గీకరణ- సమానత్వంలో అంతర్గత న్యాయం**

అంబేద్కర్ ఆలోచనల ప్రేరణతో ఏర్పడిన రిజర్వేషన్ వ్యవస్థలో, నేటి కాలంలో ఎస్సీ వర్గీకరణ (సబ్-క్లాసిఫికేషన్) అనే అంశం ముఖ్య చర్చగా మారింది. ఎస్సీ వర్గాల్లో కూడా అభివృద్ధి అసమానంగా ఉందనే అభిప్రాయం పెరుగుతోంది. కొంతమంది ఉపవర్గాలు ఎక్కువ ప్రయోజనాలు పొందగా, మరికొన్ని ఇంకా వెనుకబడి ఉన్నాయని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, వనరులు సమానంగా పంచడానికి వర్గీకరణ అవసరమా అనే చర్చ కొనసాగుతోంది. కొన్ని రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణకు ప్రయత్నాలు చేస్తున్నాయి, తద్వారా అత్యంత వెనుకబడిన ఉపవర్గాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలనే లక్ష్యం ఉంది. అయితే, ఇది అమలు చేసే విధానంలో సమాజ ఐక్యతను కాపాడుతూ, నిజమైన అవసరమైన వారికి ప్రయోజనం చేకూరేలా జాగ్రత్తలు అవసరం

**నేటి ప్రభుత్వాలు - అంబేద్కర్ ఆశయాల అమలు**

ప్రస్తుతం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అంబేద్కర్ చూపిన మార్గంలో పలు చర్యలు చేపడుతున్నాయి...

- విద్యలో రిజర్వేషన్లు అండ్ స్కాలర్‌షిప్‌లు
- ఉద్యోగాల్లో ప్రాతినిధ్యం పెంపు
- రాజకీయ రిజర్వేషన్లు (పార్లమెంట్, పంచాయతీలు)
- సంక్షేమ పథకాలు (గృహ, ఉపాధి, ఆరోగ్యం)
- ఆర్థిక సాధికారతకు రుణాలు, సబ్సిడీలు

ఇవి అన్నీ అంబేద్కర్ ఆశయాల ప్రతిబింబాలే అయినప్పటికీ, అమలు మరింత సమర్థవంతంగా ఉండాలి.

**అంబేద్కర్ కల -- మన బాధ్యత**

అంబేద్కర్ జయంతి ఒక ఉత్సవం మాత్రమే కాదు; అది ఒక బాధ్యతను గుర్తు చేసే రోజు. సమానత్వం, న్యాయం, సోదరభావం కలిగిన సమాజాన్ని నిర్మించడమే ఆయనకు నిజమైన నివాళి. అంబేద్కర్ జీవితం యువతకు గొప్ప మార్గదర్శకం. కష్టాలను అధిగమించడం, హక్కుల కోసం పోరాడడం, సమాజానికి బాధ్యత వహించడం, ఇవి ఆయన ఇచ్చిన అమూల్య పాఠాలు. రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి చర్యలు తుది లక్ష్యం కాదు - అవి సమానత్వ సమాజ నిర్మాణానికి మార్గాలు మాత్రమే. అంబేద్కర్ చూపిన దారిలో ముందుకు సాగుతూ, ప్రతి వ్యక్తికి గౌరవప్రదమైన జీవితం కల్పించే భారతదేశాన్ని నిర్మించడం మనందరి కర్తవ్యం.

**తొలి జీవితం ... కష్టాల్లో కరిగిన వ్యక్తిత్వం...**

భీంరావ్ రాంజీ అంబేద్కర్ 1891 ఏప్రిల్ 14 న అప్పటి సెంట్రల్ ప్రావిన్సెస్‌లో సైనిక స్థావరమైన 'మౌ' అన్న గ్రామంలో (ఇప్పటి మధ్యప్రదేశ్ లో) రాంజీ మలోజీ సక్పాల్, భీమాబాయ్ దంపతులకు చివరి సంతానంగా (14వ) జన్మించాడు. ఇతని అసలు పేరు భీమారావు రాంజీ అంబేద్కర్. ఇతని కుటుంబం ఆధునిక మహారాష్ట్ర లోని రత్నగిరి జిల్లాలో అంబవాడ గ్రామంలో నివసించినందున వారు మరాఠీ నేపథ్యం కలవారు. వీరి వంశీకులు మహార్ కులానికి చెందినవారు. ఇతని తండ్రి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీలో సుబేదారుగా పనిచేసాడు. అంబేద్కర్ ఆరేళ్ళ వయసులోనే అశ్రద్ధ, అవగాహన లేకపోవడం, ఆర్థిక కష్టాల కారణంగా అనారోగ్యంతో తల్లి చనిపోయింది. మొత్తం 13 మంది తోబుట్టువులలో తొమ్మిది మంది అకాల మృత్యువాత పడగా ఇద్దరు అక్కలు - మంజుల, తులసి, ఇద్దరు అన్నలు- బలరాం, ఆనందరావు మిగిలారు. మెహర్లను అస్పృశ్యులుగా పరిగణించడం వలన అంబేద్కర్ చిన్నతనంలో లోనే అంటరానితనాన్ని ఎదుర్కొన్నాడు. అతను వేరే పిల్లలతో కలవకుండా, మాట్లాడకుండా పాఠశాల గదిలో ఒక మూల కూర్చోబెట్టేవారు. మిగతా కులం వాళ్ళకి భిన్నంగా అస్పృశ్యులు నీళ్ళు తాగాలంటే ప్యూన్ (కార్మికుడు) వచ్చి ఇచ్చేవాడు. అతను లేకపోతే పిల్లలు నీళ్ళు తాగే అవకాశం వుండేది కాదు. ఈ దుస్థితిని అంబేద్కర్ క్లుప్తంగా - "ప్యూన్ లేదు కనుక నీళ్ళు లేవు" అని వివరించాడు.

**- సామాజిక సమానత్వానికి శాశ్వత దీప్తి మన 'అంబేద్కర్'**

డబ్బులు చెల్లించే స్తోమత ఉన్నా సేవలు అందిచేవాళ్ళు ముందుకు రాకపోవడం వలన (మంగలి, చాకలి వీరిని ముట్టుకునేవారు కాదు) అతని సోదరులే ఇంట్లో బట్టలు ఉతకడం, జుట్టు కత్తిరించుకోవడం చేసుకునేవారు. అంబేద్కర్ తొమ్మిది సంవత్సరాల వయసులో మాసూర్ నుండి గోరేగావ్ కి ప్రయాణం చేయడానికి అంటరానివారని ఎద్దబండి వాళ్ళు ఎవ్వరూ ముందుకురాకపోతే, మసూర్ స్టేషన్ మాస్టర్ సహాయంతో బండివాడికి రెండింతలు కిరాయి ఇచ్చి బండివాడు వెనుక నడువగా అంబేద్కర్ సోదరులే సొంతగా బండి తోలుకొని వెళ్లారు.

అంబేద్కర్ సాధించిన డిగ్రీలు ఇవే...

బి.ఎ. (బాంబే విశ్వవిద్యాలయం, 1912)
ఎం.ఎ. (కొలంబియా విశ్వవిద్యాలయం, 1915)
ఎమ్మెస్సీ ( లండన్ స్కూల్ ఆఫ్ ఏకనామిక్స్, 1921)
పి. హెచ్. డి. (కొలంబియా విశ్వవిద్యాలయం, 1927)లి25ర
డి.ఎస్.సి ( లండన్ విశ్వవిద్యాలయం, 1923)
బారిష్టర్ ఎట్ లా (గ్రేస్ ఇన్ లండన్, 1923)
ఎల్. ఎల్. డి ( కొలంబియా విశ్వవిద్యాలయం, 1952, గౌరవపట్టా)
డి. లిట్. ( ఉస్మానియా విశ్వవిద్యాలయం, 1953, గౌరవపట్టా)

**అంబేద్కర్ యుగపురుషుడు: డాక్టర్ జి మధు చరిత్ర అధ్యాపకుడు**



బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతూ తాను పడిన కష్టం తన తర్వాత తరం పడకూడదని దూరం చూపుతో ఆలోచించి రాజ్యాంగాన్ని అందించిన మహా మేధావి అంబేద్కర్ యుగపురుషుడు. ఆయన లాంటి వారు ఎవరు ఉండరు ఇక ఉండబోరు. తాను పడిన కష్టంలో నుంచి కలిగిన ఆలోచనను పదును పెట్టి దానిని కార్యరూపంగా వలసిన మహా శిల్పి అంబేద్కర్. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ ఆశే సాధన కోసం పాటుపడడమే ఆయనకు మనం ఇచ్చే ఘనమైన నివాళి.

# నంద తండలో అమ్మ ఆదర్శ పాఠశాల

# నిధుల దుర్వినియోగం?




- **చర్యలు తీసుకోవాలి**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్ఎల్డీ పార్టీ జిల్లా కార్యదర్శి మూడ్ వీరన్న డిమాండ్**
- **పొంతనలేని సమాధానాలతో తప్పించుకుంటున్న ఉపాధ్యాయులు**




**చుంచుపల్లి, ఏప్రిల్ 13(మనం న్యూస్):** నంద తండ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో "అమ్మ ఆదర్శ పాఠశాల" పథకం కింద విడుదలైన నిధుల వినియోగంపై సంచలన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులు దారి మళ్లించబడ్డాయనే ఆరోపణలు వెళ్ళు వెత్తుతున్నాయి.ఈ ఘటనపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్ఎల్డీ పార్టీ జిల్లా కార్యదర్శి మూడ్ వీరన్న తీవ్రంగా స్పందిస్తూ, పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరిపి, నిధులు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆరోపణలు గంభీరంగా ఉన్నాయి. పాఠశాలలో ఇప్పటికే ఉన్న పాత నీటి ట్యాంక్‌కు కేవలం రంగు వేసి కొత్తదిగా చూపించి నిధులు కాజేసినట్లు ఆరోపిస్తున్నారు...? బోరు మరమ్మతులు చేసినట్లు పత్రాల్లో చూపించినా, వాస్తవంగా ఎలాంటి పనులు జరగలేదని స్థానికులు వెల్లడిస్తున్నారు.అదే విధంగా, ఎలక్ట్రికల్ పనుల పేరుతో అనవసరంగా భారీ ఖర్చులు చూపించి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి...?పాఠశాలలో కనీస సదుపాయాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, అధికారిక రికార్డుల్లో మాత్రం అన్ని పనులు పూర్తయ్యాయని చూపించడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇంకా ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, విద్యార్థులకు అందాల్సిన మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బియ్యం కూడా మాయం అయినట్లు ఆరోపణలు రావడం. పిల్లల ఆహారాన్ని కూడా వదల్లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఆరోపణలపై ప్రస్తుత ఉపాధ్యాయులను ప్రశ్నించగా, "ఈ పనులు మా సమయంలో జరగలేదు, గత టీచర్ హయాంలో జరిగి ఉండొచ్చు" అంటూ బాధ్యతను తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని గ్రామస్తులు మాట్లాడుకోవడం విడ్డూరం.. ఒకరిపై ఒకరు నెపం మోపుకోవడం తప్ప నిజాలు బయటపెట్టే ప్రయత్నం ఎవరూ చేయడం లేదని విమర్శిస్తున్నారు.అమ్మ ఆదర్శ పాఠశాల నిధులు ఎక్కడికి పోయాయి? విద్యార్థులకు రావాల్సిన సౌకర్యాలు ఎందుకు అందడం లేదు?అనే ప్రశ్నలు గ్రామంలో గట్టిగా మారుమోగుతున్నాయి.గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు ఏకగ్రీవంగా డిమాండ్ చేస్తూ, నిధుల వినియోగంపై తక్షణమే సోషల్ ఆడిట్ నిర్వహించాలి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పూర్తి స్థాయి విచారణ జరపాలి అని కోరుతున్నారు.మొత్తానికి, నంద తండ ప్రాథమిక పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల వినియోగంపై వెలుగులోకి వస్తున్న ఈ ఆరోపణలు గ్రామంలో వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజాలు బయటపడతాయా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్నగా మారింది.

# అందని భగీరథ జలాలు

- ట్యాంకుల నిండా నీరున్నా నిష్ఫలం
- ఇది పత్తిపాక, జిన్నగట్ట గ్రామాల పరిస్థితి
- పైపు లైన్లకు ఎక్కడ పడితే అక్కడ లీకులు
- మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం
- నాణ్యత లేని పైపులు వేసిన ఫలితమే
- త్రాగునీటికి కష్టాలు
- గ్రామాల ప్రజలు ఆరోపణ





**దుమ్ముగూడెం ఏప్రిల్ 13( మనం న్యూస్ ):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పేరుతో గ్రామ సభలు నిర్వహించి జల మహోత్సవాలు నిర్వహిస్తుండగా మరోపక్క ఏజెన్సీ ప్రాంత కొన్ని మారుమూల గ్రామాలలో మిషన్ భగీరథ నీరు అందక నీటి కష్టాలు ఎదుర్కొంటూనే ఉన్నారు. మండల పరిధి మారుమూల గ్రామాలైన పత్తిపాక, జిన్నేగట్టు గ్రామాలలో మిషన్ భగీరథ అధికారులు నిర్మించిన నీటి ట్యాంకులు ప్రతిరోజు మిషన్ భగీరథ నీటితో నిండి నిండుకుండలా వున్నా ఆ గ్రామాల ప్రజల దహార్తిని మాత్రం తీర్చలేక పోతున్నాయి. ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో ఆనాటి ప్రభుత్వం అధికారులు ఈ రెండు గ్రామాలకు ట్యాంకులు నిర్మించి పైపులైన్ వేశారు. అప్పటి కాంట్రాక్టర్ నాశిరకం పనులతో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యంతో అస్తవ్యస్తమైన పైపులైన్లతో ఆ గ్రామాల ప్రజలకు త్రాగునీరు అందలేదు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్ నెలలో ఈ రెండు గ్రామాలకు పైపులైన్లు కొత్తగా వేయడానికి నిధులు కేటాయించగా ఓ కాంట్రాక్టర్ ఈ గ్రామాలకు ట్యాంకులను అనుసంధానం చేస్తూ పైప్ లైన్లు వేశారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు ఈసారైనా మిషన్ భగీరథ నీరుతో మా గొంతు తడుస్తుందనే ఆశతో ఉండగా మళ్లీ ఆ ఆశ నిరాశ గాని మిగిలింది. పత్తిపాక గ్రామంలో మడకం వారి గుంపు అప్క వారి గుంపు ఉండగా ఈ గ్రామంలో 85 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ కుటుంబాలకు నీరు అందించేందుకు కాంట్రాక్టర్ నూతనంగా పైప్ లైన్ నిర్మాణం చేసి ఇంటింటికి నల్లాలు వేశారు. పత్తిపాక బ్రిడ్జి వద్ద పైపులైను పగిలి నీరు లీకు అవుతుండగా మడకం వారి గుంపులో మడకం చిట్టిబాబు ఇంటి వద్ద రెండుచోట్ల, కంగాల బుజ్జి ఇంటి వద్ద , సోడి వారి గుంపులో సోడి శ్రీను ఇంటి వద్ద పైపులైన్లు పగిలి మీరు వృధాగా పోతుండడంతో ఇండ్లకు అమర్చిన నల్లాలకు నీళ్లు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. నాణ్యతలేని పైపులు వేయడం వలన, పైపులైను పూడ్చేటప్పుడు బ్లేడు ట్రాక్టర్లతో తోయడం వలన పైపులు పగిలి కొత్త పైపులైను వేసిన నాటి నుండి కూడా ఏ ఒక్క రోజు మిషన్ భగీరథ నీటితో మా గొంతు తడవలేదని గ్రామస్తులు వాపోతున్నారు. 50 ఏళ్ల క్రితం నిర్మించిన మూడు చేతిపంపుల నీరే ప్రస్తుతం ఈ గ్రామాల ప్రజలకు పెద్ద దిక్కుగా నిలిచాయి. గ్రామం ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో రోజు రోజుకి భూగర్భ జలాలు అడుగంటుతుండగడంతో ఆ చేతి పంపులలో మీరు కూడా రోజురోజుకీ తగ్గుతుంది. క్రమక్రమంగా భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటుతే గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొనే పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్లకు తక్షణం రిపేర్లు నిర్వహించి మిషన్ భగీరథ నీరు అందించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**జిన్నగట్టు గ్రామస్తుల పరిస్థితి అదే**

పత్తిపాక గ్రామానికి ఆనుకుని ఉన్న జిన్నగట్టు గ్రామస్తులకు మిషన్ భగీరథ నీరు అందని అదే పరిస్థితి. ఈ గ్రామంలో నాలుగు గుంపులలో సుమారు 40 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామంలో కూడా మిషన్ భగీరథ ట్యాంక్ ఉండి రోజు నీటితో నిండుతున్నా గ్రామస్తులకు మాత్రం అందరిని ద్రాక్ష లాగా మిగిలింది. ఆపక.సుభద్ర ఇంటి వద్ద ఇండ్లకు మీరు సరఫరా చేసే డెలివరీ పైపు భారీ స్థాయిలో లీక్ అవడంతో ట్యాంకులో ఉన్న నీరంతా ఆ లీక్ వద్దే వృధాగా పోతుంది. గత సంవత్సరం నుండి ఇదే పరిస్థితి కొనసాగుతున్నా మండల అధికారులు వేసవికాలంలో గ్రామాలలో నీటి ఎద్దడిని నివారించాలని ప్రణాళికల మీద ప్రణాళికలు రూపొందిస్తున్నా కనీసం పైపులైన్ లీకేజీలను రిపేరు చేసి ఈ రెండు గ్రామాల ప్రజలకు మిషన్ భగీరథ నీరు అందించాలన్న ఆలోచన గాని చిత్తశుద్ధి గాని ఉన్న పరిస్థితి కనిపించడం లేదు. ఈ గ్రామంలో గతంలో గ్రామస్తులు ఉపయోగిస్తున్న రెండు చేతిపంపులకు సింగిల్ ఫేస్ తో పనిచేసే విద్యుత్ మోటార్లను బిగించి రెండు మినీ ట్యాంకులు నిర్మించారు. అవి కూడా గత ఏడాది నుండి వాటి అలనా పాలనా చూసేవాడు కరువై పైపులైన్లు ఎక్కడికక్కడ పగిలిపోయి నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం ఆ గ్రామస్తులు ఉన్న రెండు చేతి పంపుల నీటితోనే త్రాగునీటి, ఇతర అవసరాలను తీర్చుకునే పరిస్థితి ఉంది. తీవ్రమైన ఎండలతో అరాకొరగ పనిచేసున్న ఈ రెండు చేతు పంపులు కూడా భూగర్భ జలాలు అడుగంటుతుండ డంతో అంతంత మాత్రంగానే నీటిని అందించగలుగుతున్నాయని మరి కొద్ది రోజులు గడిస్తే ఈ చేతి పంపులు కూడా నీటిని అందించలేని పరిస్థితి ఏర్పడుతు ందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీ మారుమూల ప్రాంత ఆదివాసి గిరిజన గ్రామాల ప్రజలు కలుషిత నీరు త్రాగి రోగాలు బారిన పడ కుండా మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధ జలాలను అందించాలనే లక్ష్యంతో నాటి నేటి పాలకులు లక్షల రూపాయలు ఖర్చు చేసి పైపులైను నిర్మించి ట్యాంకులు నిర్మించినా వీటి నిర్వహణ సక్రమంగా







లేక వీటిని పట్టించుకునే నాధుడే లేక మా గ్రామాలకు త్రాగునీరు అందడం లేదని ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో పైప్లైన్లకు రిపేర్లు నిర్వహించి ఇంటింటికి మిషన్ భగీరథ నీరు అందేలా చూడాలని గ్రామాల ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు.




# పర్ణశాలలో వాహన పార్కింగ్ సమస్యను పరిష్కరించాలి

## - గ్రామస్తులు సర్పంచ్ కి వినతి పత్రం

**దుమ్ముగూడెం ఏప్రిల్ 13 (మనం న్యూస్):** పర్ణశాల పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తుల వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే పర్ణశాలలో వాహన వాహనాలు పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పర్ణశాల గ్రామ యువత గ్రామ సభలో సర్పంచ్ వాగే ఖాదర్ బాబు కార్యదర్శి శ్రీనివాసరావులకు వినతి పత్రం అందజేశారు. పర్ణశాలకు నిత్యం వందలాది వాహనాలు వస్తున్నాయని, వచ్చే యాత్రికుల వాహనాలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గేటు ముందుగా, ప్రధాన రహదారి మీదనే అడ్డదిడ్డంగా వాహనాలు నిలపడం వలన అటు విద్యార్థులకు వాహనదారులకు భక్తులకు, గ్రామస్తులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తరచూ ట్రాఫిక్ సమస్య ఎదురవుతుందని వారు తెలిపారు. ఒక మనిషిని ఏర్పాటు చేసి పర్ణశాలకు వచ్చే యాత్రికుల వాహనాలను ఖాళీ మైదానంలోకి మలిస్తే ఈ సమస్యకు పరిష్కారం దొరుకుతుందని వారు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన సర్పంచ్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో వార్డు సభ్యులు సకినం. సతీష్ గోసుల. సుల నాగేశ్వరరావు కాగితాల శివ కృష్ణ, యగ్గడి. విష్ణు, కుందవరపు పవన్ చారి తదితరులు పాల్గొన్నారు.

# నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**అశ్వాపురం, ఏప్రిల్ 13( మనం న్యూస్ ):** భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబా సాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మంగళవారం అశ్వాపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి ఆటో స్టాండ్ వద్ద నూతన అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మరియు జయంతి వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని అంబేద్కర్ యువజన సంఘం ఆహ్వాన కమిటీ పిలుపునిచ్చింది. ఉదయం 9 గంటలకు గౌతమీనగర్ కాలనీ గేట్ వద్ద నుండి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం అంబేద్కర్ విగ్రహావిష్కరణ, తద నంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అంబేద్కర్ వాదులు , మేధావులు, అధికారులు, అనధి కారులు, ప్రజా ప్రతినిధులు, జడ్పీటీసీ లు, ఎంపీపీలు, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు వార్డు మెంబర్స్,కో -ఆప్షన్ సభ్యులు, మీడియా మిత్రులు, కుల సంఘాల నాయకులు, వివిధ పార్టీల మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు, అభిమానులు, వ్యాపార వర్గాలు, అధిక సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ జయంతి వేడుకలు జయప్రదం చేయాలని కోరారు.




**మల్లెల మడుగులో.....**

మల్లెలమడుగు గ్రామపంచాయతీలో మంగళవారం నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలకు అందరూ ఆహ్వానితులేని సర్పంచ్ మచ్చ నరసింహారావు పిలుపునిచ్చారు. అంబేద్కర్ వాదులు, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై అంబేద్కర్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

# కార్మికుడి మృతికి విజయదుర్గ ట్రాన్స్‌పోర్ట్ యజమాని ఆర్థిక సాయం

## -- మృతుని తల్లికి రూ. 25 వేల చెక్కు అందజేత

**బూర్గంపహాడ్ , ఏప్రిల్ 13 (మనం న్యూస్):** బూర్గంపహాడ్ మండలంలోని మొరంపల్లి బంజర గ్రామానికి చెందిన సంగు రాఘవేందర్ రెడ్డి (పెప్సీ) అనే యువకుడి కొద్దిరోజుల క్రితం అకాల మరణం పట్ల విజయదుర్గ ట్రాన్స్‌పోర్ట్ యజమాని యలం బాబ్జీ మానవత్వం చాటుకున్నారు. తన దగ్గర పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బాబ్జీ, ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన రూ. 25,000/- (ఇరవై ఐదు వేల రూపాయల) చెక్కును మృతుడి తల్లికి అందజేసి తన వంతు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్మికుల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, ఆపద సమయంలో పెద్ద మనసుతో స్పందించిన యలం బాబ్జీని గ్రామస్థులు మరియు ట్రాన్స్‌పోర్ట్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయదుర్గ ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

